# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 338, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) గురువారం - 20 - ఫిబ్రవరి - 2025


## భారత్ వద్ద చాలా డబ్బు ఉంది..

## అలాంటప్పుడు మనం ఎందుకు వారికి సాయం చేయాలి : డొనాల్డ్ ట్రంప్



భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు మునుపటి బైడెన్ సర్కారు 21 మిలియన్ డాలర్లు కేటాయించడం, తాజాగా ట్రంప్ సర్కారు వాటిని నిలిపివేయడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి అమెరికా ప్రభుత్వం అందజేసే 21 మిలియన్ డాలర్లను ఇక నుంచి నిలిపివేస్తున్నట్టు ట్రంప్ యంత్రాంగంలో మిగతా..2లో

## ప్రచండ వేగంతో భూమి వైపు దూసుకు వస్తున్న గ్రహశకలం..

## ముప్పు రోజురోజుకూ పెరుగుతోందంటున్న నాసా



- హిరోషిమా బాంబుకు 500 రెట్లు ప్రభావం చూపే అవకాశం
- 2032 డిసెంబర్ 22 న భూమిని తాకొచ్చని నాసా అంచనా
- గాలిలో పేలిపోయినా పెను ప్రభావమే ఉంటుందని వివరణ

అంతరిక్షంలో ఓ భారీ గ్రహశకలం భూమివైపు దూసుకొస్తోందని నాసా శాస్త్రవేత్తలు వెల్లడించారు. 2023 డిసెంబర్ లోనే మిగతా..2లో

## త్వరలో పీఎం కిసాన్ 19వ విడత నిధుల విడుదల



- ఫిబ్రవరి 24న విడుదల కానున్న పీఎం కిసాన్ నిధులు
- రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున నిధుల జమ
- 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం

## నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం: నారా లోకేశ్ నిర్ణయం



వివరాలు 2లో..

- తిరుపతి పర్యటనలో కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం
- ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేత
- కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలని నేతలకు పిలుపు

అమరావతి : తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాలతో అతిపెద్ద కుటుంబంగా మారిన సందర్భంలో కార్యకర్తే అధినేత అని స్పష్టం చేసిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్... తాను అన్న మాటలను ఆచరణలో పెట్టారు. కార్యకర్తే అధినేత అన్న మాటను శిరసావహిస్తూ... తన తిరుపతి నియోజకవర్గ పర్యటనలో ముందుగా పార్టీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశం నిర్వ హించారు. ఇకపై ఏ నియోజకవర్గ పర్యటనకు వెళ్లినా మొదట కార్యకర్తలతో

# ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోండి..

### 50 శాతం నిష్పత్తిలో కాకుండా 100 శాతం నష్టాన్ని కేంద్రం భరించాలని విజ్ఞప్తి

- మిర్చి రైతుల కోసం కేంద్రమంత్రికి చంద్రబాబు లేఖ
- ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలంటూ మంత్రి శివరాజ్ సింగ్ కు లేఖ
- మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద వెంటనే మిర్చి పంటను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి
- రైతులు అమ్ముకునే ధరకు, సాగు వ్యయానికి మధ్య పొంతన ఉండటం లేదని వ్యాఖ్య



అమరావతి : ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలంటూ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ కు లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రైతులను ఆదుకోవాలని కోరారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతుల నుంచి వెంటనే మిర్చి పంటను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ నెల 14న ఢిల్లీలో మిర్చి రైతుల పరిస్థితి, ధరల పతనంపై జరిగిన సమావేశం వివరాలను చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను కూడా సమర్పించినట్లు సీఎం గుర్తు చేశారు. గత పదేళ్లలో మిర్చి ఉత్పత్తి, ధరల వివరాలను కూడా లేఖలో తెలిపారు. ఈ మధ్య మిర్చి ధరలు బాగా పడిపోయాయని చంద్రబాబు పేర్కొన్నారు. సాధారణ మిర్చి క్వింటాల్ కు రూ. 11 వేలు, ప్రత్యేక వెరైటీ మిర్చి క్వింటాలు రూ. 13 వేలకు పడిపోయిందన్నారు. ఆ ధర గతంలో రూ. 20 వేలుగా ఉండేదన్నారు. విదేశాలకు మిర్చి ఎగుమతి తగ్గిపోవడం కూడా ఈ పరిస్థితికి ఒక కారణమని అన్నారు. మిర్చి ధరలు బాగా తగ్గిపోవడంతో రైతులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదన్నారు. రైతులు అమ్ముకునే ధరకు, సాగు వ్యయానికి మధ్య పొంతన ఉండటం లేదన్నారు. 50 శాతం నిష్పత్తిలో కాకుండా 100 శాతం నష్టాన్ని కేంద్రం భరించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ జోక్యం ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు.

## ముడా కేసులో సిద్ధరామయ్యకు భారీ ఊరట.. ఎలాంటి ఆధారాలు లేవన్న లోకాయుక్త



న్యూఢిల్లీ : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు భారీ ఊరట కలిగింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (%వీఖణూా%) భూకుంభకోణంలో ఆయనకు అవినీతి నిరోధక సంస్థ లోకాయుక్త క్లీన్ చీట్ ఇచ్చింది. ముడా కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన భార్యతో పాటు ఇతరులకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదని లోకాయుక్త పోలీసులు ప్రకటించారు. ముడా భూముల కేటాయింపుల వివాదంలో కోట్లాది రూపాయల విలువైన భూములను తన భార్య పార్వతికి దక్కేలా మిగతా..2లో

# తెలంగాణా రాష్ట్ర ప్రాజెక్ట్ ల నిర్మాణాలకు క్లియరెన్స్ ఇవ్వండి

### ప్రాజెక్ట్ ల నిర్మాణాలకు 0% వడ్డీతో 50 ఏళ్ల వ్యవధితో కేంద్రం రుణాలు

- మెడిగడ్డ పై త్వరలోనే ఎన్.డి.ఎస్ నివేదిక
- నివేదిక అనంతరం తదుపరి చర్యలపై సిఫారసు
- తెలంగాణా రాష్ట్ర ప్రాజెక్ట్ ల నిర్మాణాలకు క్లియరెన్స్ ఇవ్వండి
- అంతర్ రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలి
- పరిశీలనలో తెలంగాణ
- -మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్ లో రెండో రోజు కొనసాగిన జాతీయ నీటిపారుదల శాఖా మంత్రుల సదస్సు
- కేంద్ర జలవనరుల శాఖామంత్రి సి.ఆర్.పాటిల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటి
- మంత్రి ఉత్తమ్ డిమాండ్స్ కు కేంద్ర మంత్రి సానుకూల స్పందన



హైదరాబాద్ : సీతారామ ప్రాజెక్టు కు నెల రోజుల్లో అనుమతులు క్లియర్ కానున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు రాజస్థాన్ లో మంగళవారం, బుధవారం జరుగుతున్న జాతీయ నీటిపారుదల శాఖా మంత్రుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెండో రోజు సదస్సులో పాల్గొన్న మిగతా..2లో

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అధికారులకు ఈటల వార్నింగ్




- నిబంధనలకు లోబడి పనిచేయాలంటూ సివిల్ సర్వెంట్లకు హితవు
- ప్రభుత్వంలోని పెద్దలు ఆదేశించారని రూల్స్ అతిక్రమించొద్దని సూచన
- ఆరెంజ్ బుక్ మెయింటెయిన్ చేస్తున్నామని హెచ్చరిక

## ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీపై టీడీపీ కీలక నిర్ణయం!



అమరావతి : ఏపీలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. అంటే.. మరో వారం రోజుల్లో ప్రచారానికి తెరపడనుంది. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండగా.. ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీలో ఉన్నవారిలో ఇద్దరూ టీడీపీ నాయకులే కావడం గమనార్హం. ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి మిగతా..2లో

## చంద్రబాబుకు సెక్యూరిటీ కూడా లేకుండా చేస్తా: జగన్



- గుంటూరు మిర్చియార్డులో పర్యటించిన జగన్
- ఈసీ ఆదేశాలను లెక్కచేయని వైనం
- మళ్లీ వచ్చేది వైసీపీ అని ధీమా

# రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతోంది- కేసీఆర్

### పార్టీ పనైపోయిందని ప్రచారం చేసిన బీఆర్ఎస్ నేతలపై కేసీఆర్ ఫైర్

- బీఆర్ఎస్ పనైపోయిందని మనవాళ్లే ప్రచారం చేశారు: కేసీఆర్
- పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కీలక నిర్ణయాల ప్రకటన
- ఘనంగా బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణ
- పార్టీ కమిటీలకు గులాబీ బాస్ ఆదేశం
- కమిటీల ఇంఛార్జిగా హరీష్‌రావు నియామకం
- ఏప్రిల్ 10 నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం
- ఏప్రిల్ 27వ బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- డీలిమిటేషన్ తర్వాత మహిళలకు 53 సీట్లు కేటాయిస్తాం: కేసీఆర్
- తెలంగాణలో 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం: కేసీఆర్




హైదరాబాద్, : బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆసక్తికర వ్యాఖ్యలతో మొదలుట్టారు. పార్టీ పని అయిపోయిందంటూ వ్యతిరేక ప్రచారం చేసిన బీఆర్ఎస్ నేతలపైన ఆయన మండిపడ్డారు."ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందగానే పార్టీ పని అయిపోందని మన పార్టీ నేతలే ప్రచారం చేశారు. అందుకే 10 మంది ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారు. ఇలాంటి ప్రచారం చేయడం సరైంది కాదు.

## ఢిల్లీ సీఎంగా ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి.. రేసులో ఉన్నది వీళ్లే..



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిని ఎవరు అధిష్ఠిస్తారన్న సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ ఉత్కంఠకు మరి కాసేపట్లో తెరపడనుంది. బీజేపీ శాసన సభాపక్షం తమ నేతను నేడు ఎంపిక చేసుకోనుంది. రాత్రి 7 గంటలకు సమావేశం అనంతరం ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్నది ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇక రేపు సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుందని సమాచారం. అయితే, తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఢిల్లీ కొత్త సీఎం బనియా సామాజికవర్గానికి మిగతా..2లో

## భారత్ వద్ద చాలా డబ్బు ఉంది..
## అలాంటప్పుడు మనం ఎందుకు వారికి సాయం చేయాలి : డొనాల్డ్ ట్రంప్

మొదటి పేజి తరువాయి

కీలక పాత్ర పోషిస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు డోజ్ శాఖ నిర్ణయాన్ని సమర్థించారు. ఫ్లోరిడాలోని తన నివాసమైన మార్ ఎ లాగోలో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిధుల నిలిపివేత గురించి ప్రశ్నించగా.. భారత్ వద్ద చాలా డబ్బులు ఉన్నాయని.. అలాంటప్పుడు ఇండియాకు 21 మిలియన్ డాలర్ల సాయం ఎందుకు చేయాలంటూ ప్రశ్నించారు. తనకు భారత ప్రజలు, ప్రధాని పట్ల ఎంతో గౌరవం ఉందని చెప్పారు. 'భారత్‌కు 21 మిలియన్ డాలర్లు ఎందుకు ఇవ్వాలి..? వారివద్ద చాలా డబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధికంగా పన్ను విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు విధించే సుంకాలు కూడా చాలా ఎక్కువ. సుంకాల విషయంలో అమెరికా ఎన్నడూ భారత్‌ను చేరుకోలేదు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు మాత్రం మనం 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా..? మరి మన దేశంలో ఓటర్ల పరిస్థితి ఏంటి..?' అంటూ ట్రంప్ ప్రశ్నించారు. ప్రభుత్వ వ్యవస్థలో సంస్కరణల కోసం టెస్లా బాస్ ఎలాన్ మస్క్ సారథ్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)ను ట్రంప్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డోజ్ బాధ్యతలు చేపట్టిన మస్క్.. కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే అమెరికాలో పన్ను చెల్లింపుదారులు కట్టే సొమ్మును వివిధ దేశాల కోసం ఖర్చు పెడుతున్నారని, వాటన్నింటినీ నిలిపివేస్తున్నట్లు ఇటీవల మస్క్ ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడానికి అందజేస్తోన్న 21 మిలియన్ డాలర్ల (రూ.187 కోట్లు)తో పాటు బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి కేటాయించిన రూ.215 కోట్లుతోపాటు పాకిస్థాన్, నేపాల్ సహా పలుదేశాలకు కేటాయించిన సాయాన్ని డోజ్ శాఖ రద్దు చేసింది.

## ప్రచండ వేగంతో భూమి వైపు దూసుకు వస్తున్న గ్రహశకలం..
## ముప్పు రోజురోజుకూ పెరుగుతోందంటున్న నాసా

మొదటి పేజి తరువాయి

ఈ గ్రహ శకలాన్ని గుర్తించామని, దీనిని 2024 వైఆర్4 గా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఈ గ్రహశకలం భూమిని తాకే అవకాశం కేవలం 1 శాతమే ఉందని తొలుత అంచనా వేసిన శాస్త్రవేత్తలు.. తాజాగా ఈ ముప్పు రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 40 మీటర్ల నుంచి 90 మీటర్ల పరిమాణంలో ఉన్న ఈ ఆస్టరాయిడ్ 2032 డిసెంబర్ 22 న భూమిని తాకొచ్చని చెబుతున్నారు. ఈ ఏడాది జనవరి 29న మరోసారి 2024 వైఆర్ 4 కదలికలను పరిశీలించగా భూమిని తాకే ప్రమాదం కేవలం 1 శాతం ఉందని తేలిందన్నారు. అయితే, ఈ నెలలో జరిపిన పరిశోధనలో ఈ ముప్పు 3.2 శాతానికి పెరిగిందని తెలిపారు. భారీ పరిమాణంలో ఉన్న ఈ గ్రహశకలం దాదాపు గంటకు 40 వేల మైళ్ల వేగంతో భూమి వైపు దూసుకు వస్తోందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. ఒకవేళ ఈ గ్రహశకలం భూమిని ఢీ కొట్టకపోయినా, వాతావరణంలోకి ప్రవేశించిన తర్వాత పేలిపోయినా కూడా ప్రభావం భారీగానే ఉంటుందని చెప్పారు. హిరోషిమాపై వేసిన అణుబాంబుతో పోలిస్తే 500 రెట్లు అధిక ప్రభావం ఉంటుందని అంచనా వేశారు. గ్రహ శకలం మార్గాన్ని పరిశీలించగా.. ఇది నేరుగా పసిఫిక్ సముద్రంలో లేదా నార్తరన్ సౌత్ అమెరికా, అట్లాంటిక్ సముద్రం, ఆఫ్రికా, అరేబియన్ సముద్రం, దక్షిణాసియాలలో ఏదో ఒకచోట పడుతుందని గుర్తించినట్లు నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. ఇక ఈ 2024 వైఆర్ 4 గ్రహశకలం భూమిని తాకే ముప్పు ప్రస్తుతానికి 2.8 శాతం ఉందని యురోపియన్ స్పేస్ ఏజెన్సీ వెల్లడించింది. ఈ గ్రహశకలం భూమిని తాకుతుందా లేక గాలిలోనే పేలిపోతుందా అనే విషయంపై స్పష్టత లేదని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. అవసరమైతే గ్రహశకలాన్ని అడ్డుకుని మధ్యలోనే పేల్చివేసేందుకు తగిన సమయం ఉందని చెప్పారు. 2022 లో నాసా అభివృద్ధి చేసిన డిమాన్ స్ట్రేటెడ్ ఆస్టరాయిడ్ డిఫ్లెక్షన్ టెక్నాలజీ (డార్ట్) తో ఈ గ్రహశకలాన్ని దారి మళ్లించవచ్చని కూడా పేర్కొన్నారు.

## త్వరలో పీఎం కిసాన్ 19వ విడత నిధుల విడుదల

రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద అందించే పీఎం కిసాన్ పథకం 19వ విడత నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. ఫిబ్రవరి 24న రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. బీహార్‌లోని భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిధులను విడుదల చేయనున్నారు. 19వ విడతలో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనున్నట్లు అధికారులు వెల్లడించారు. పీఎం కిసాన్ నిధులు అందుకోవాలంటే అర్హులైన రైతులు ఎన్‌పీసీఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలి. ఈ-కేవైసీ చేసి ఉండాలి. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి స్టేటస్ తెలుసుకోవడానికి లేదా పీఎం కిసాన్ జాబితాలో పేరు ఉందో లేదో చూడడానికి పీఎం కిసాన్ ప్రభుత్వ వెబ్ సైట్‌లోకి వెళ్లి తనిఖీ చేసుకోవాలి. రిజిస్టర్డ్ మొబైల్ లేదా ఆధార్ నెంబర్‌ను ఎంటర్ చేసి వివరాలు పొందవచ్చు. పీఎం కిసాన్ మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉంటుంది.

## ముడా కేసులో సిద్ధరామయ్యకు భారీ ఊరట..
## ఎలాంటి ఆధారాలు లేవన్న లోకాయుక్త

మొదటి పేజి తరువాయి

సీఎం సిద్ధరామయ్య కుట్ర చేశారంటూ సమాచార హక్కు చట్టం కార్యకర్తలు టీజే అబ్రహం, ఎస్పీ ప్రదీప్, స్నేహమయి కృష్ణ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై గవర్నర్ విచారణకు అనుమతించారు. సామాజిక కార్యకర్తల వినతి మేరకు రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సీఎం సిద్ధరామయ్యపై విచారణకు అనుమతి ఇవ్వడం రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి మైసూర్‌లోని కేసరే గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. ఆ భూమిని ఆమెకు సోదరుడు మల్లికార్జున్ గిఫ్ట్‌గా ఇచ్చారు. ఆ భూమిని అభివృద్ధి చేసేందుకు ముడా స్వాధీనం చేసుకుంది. పరిహారం కింద 2021లో పార్వతికి దక్షిణ మైసూర్‌లో కీలకమైన విజయనగర్‌లో 38,238 చదరపు అడుగుల ప్లాట్లను ప్రభుత్వం కేటాయించింది. పరిహారం కింద ఇచ్చిన ప్లాట్ల మార్కెట్ విలువ కేసరేలో స్వాధీనం చేసుకున్న భూమి విలువకంటే ఎక్కువగా ఉంటుందని బీజేపీ ఆరోపించింది. భూ కేటాయింపుల్లో దాదాపు రూ.45కోట్ల వరకు ప్రభుత్వానికి నష్టం కలిగించినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య, కుమారుడు ఎస్ యతీంద్రతో సహా పలువురు సీనియర్ ముడా అధికారులు అక్రమాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు వచ్చాయి.

## ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీపై టీడీపీ కీలక నిర్ణయం!

మొదటి పేజి తరువాయి

పేరాబత్తుల రాజశేఖర్ బరిలో ఉన్నారు. వీరిద్దరూకూడా టీడీపీ నాయకులే కావడంతో కూటమి పార్టీలైన.. బీజేపీ, జనసేనల మద్దతును కూడగడుతున్నారు. కొన్ని కొన్ని చోట్ల నాయకులు కలిసిరాకపోవడంతో అధినాయకులే వారిని లైన్‌లో పెడుతున్నారు. దీంతో ప్రస్తుతం ఈ ఇద్దరి ప్రచారం పుంజుకుంది. %ూశ్రీంశీ =ఝు౦% - యనమలకు పట్టు చిక్కలేదు.. రాజా పట్టు వీడలేదు.. తునిలో హైడ్రామా ఇక, కీలకమైన మరో ఎమ్మెల్సీ ఎన్నిక.. ఉత్తరాంధ్రకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీస్థానం. ఇక్కడ పార్టీలకు అతీతంగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మకు టీడీపీ తాజాగా మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికలో టీడీపీ ఎవరికి మద్దతు ఇవ్వాలన్న అంశం ఇటీవల చర్చకు వచ్చింది. దీంతో ఈ విషయంతేల్చేందుకు చంద్రబాబు విశాఖ ఎంపీ.. శ్రీభరత్ నేతృత్వంలోకమిటీని వేశారు. ఆయన అన్ని కోణాల్లోనూ పరిశీలించి, అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో పాకలపాటి రఘువర్మకు టీడీపీ మద్దతు ప్రకటిస్తే బాగుంటుందన్న సూచనలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా చంద్రబాబు ఈ విషయంపై ప్రకటన చేశారు. పాకలపాటికి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఓటు హక్కు ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాకలపాటికి దన్నుగా నిలవాలని ఆయనను గెలిపించాలని పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. అదేవిధంగా ఎంపీ శ్రీభరత్ సైతం పాకలపాటిని గెలిపించాలని పార్టీ తరపున పిలుపునిచ్చారు.

## ఢిల్లీ సీఎంగా ఆ సామాజిక
## వర్గానికి చెందిన వ్యక్తి.. రేసులో ఉన్నది వీళ్లే..

మొదటి పేజి తరువాయి



చెందిన వ్యక్తి కావొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజధానిలో ప్రభుత్వాన్ని నడిపించేందుకు బనియా సామాజికవర్గానికి చెందిన నేతను పార్టీ ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇదే నిజమైతే సీఎం పదవికి పోటి పడుతున్న వారిలో బనియా సామాజికవర్గానికి చెందిన విజేందర్ గుప్తా , రేఖా గుప్తా , జితేందర్ మహాజన్ ముందు వరుసలో ఉన్నారు. విజేందర్ గుప్తా.. బీజేపీ సీనియర్ నాయకుడు. పార్టీ ఢిల్లీ విభాగానికి అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం. ప్రస్తుతం రోహిణి స్థానంలో గెలుపొందారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధిపత్యం ఉన్నప్పటికీ 2015, 2020 రెండుసార్లూ విజయం సాధించారు. అంతేకాదు ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనిచేశారు. ఆయన అనుభవం, స్థితిస్థాపకతతో పార్టీ నాయకత్వ వ్యూహంలో కీలక వ్యక్తిగా ఉన్నారు. రేఖా గుప్తా.. ఇక షాలిమార్ బాగ్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బనియా సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు రేఖా గుప్తా కూడా సీఎం రేసులో ఉన్నారు. ఢిల్లీ మేయర్‌గా పనిచేసిన రేఖా గుప్తా పేరు కూడా పార్టీ వర్గాల్లో ఎక్కువగా వినపడుతున్నది. ప్రస్తుత బీజేపీలో ఎవరూ మహిళా సీఎం లేకపోవటం ఆమెకు కలిసివచ్చే అంశమని చెబుతున్నారు. జితేంద్ర మహాజన్.. ఆర్ఎస్ఎస్‌తో బలమైన సంబంధాలు ఉన్న బనియా సామాజిక వర్గానికి చెందిన జితేంద్ర మహాజన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రోహ్‌తాస్ నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మూడోసారి ఆయన విజయం సాధించారు. జాతీయ నాయకులతో కూడా అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు.

# తెలంగాణా రాష్ట్ర ప్రాజెక్ట్ ల నిర్మాణాలకు క్లియరెన్స్ ఇవ్వండి

మొదటి పేజి తరువాయి



అనంతరం ఆయన కేంద్ర జలవనరుల శాఖామంత్రి సి.ఆర్.పాటిల్ ,ఆ శాఖా కార్యదర్శి దేబాశ్రీ ముఖర్జీ తో భేటి అయ్యారు ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖా ఎదుర్కొంటున్న అంతర్ రాష్ట్ర వివాదాలను సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరారు తెలంగాణా రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాజెక్ట్ లన్నింటికీ క్లియరెన్స్ ఇవ్వాలని ఆయన కోరారు అంతే గాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాజెక్ట్ లకు 0%వడ్డీతో 50 సంవత్సరాల వేసులు బాటుతో రుణాలు అందించే అంశాన్ని కేంద్రం పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు అంతే గాకుండా మెడిగడ్డ పై ఎన్.డి.ఎస్.ఏ నివేదికను నెలాఖరులోగా అందించి తదుపరి చర్యలకు సిఫారసు చేసేందుకు కేంద్రం సన్నద్ధమౌతుందన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్ మరియు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ నుంచి రబీ సీజన్‌లో అధిక నీటిని అక్రమంగా వాడుకుంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలకు చెందిన పూర్వ నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో రబీ పంటను కాపాడేందుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. దీనికి ప్రతిస్పందనగా, కేంద్ర మంత్రి పాటిల్, నీటి పంపిణీ సమానంగా ఉండేలా, అనధికారిక నీటి వాడకాన్ని నిరోధించే చర్యలు తక్షణమే తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో వివాదాలను నివారించడానికి, పారదర్శకతను మెరుగుపరచడానికి శ్రీశైలం మరియు నాగార్జునసాగర్ ఆనకట్టల్లో, అలాగే కృష్ణానదిపై మొత్తం 35 ప్రాంతాల్లో టెలిమెట్రీ వ్యవస్థలను అమలు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ వ్యవస్థలు నీటి వినియోగాన్ని రియల్-టైమ్‌లో గమనించేందుకు, కేటాయించిన వాటాను పాటించేలా చేయడంలో ఉపయోగపడతాయన్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, నీటి మానిటరింగ్ మెరుగుపర్చే వ్యవస్థల ప్రాముఖ్యతను అంగీకరించారు. అనుమతులు త్వరగా మంజూరు చేయడం, నిధులు అందుబాటులో ఉండేలా చేయడం అవసరమని పేర్కొంటూ.. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (పిఆర్ఎల్ఐఎస్), సీతారామ సాగర్ ప్రాజెక్ట్, సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్‌లకు నిధులు మంజూరు చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు. పిఆర్ఎల్ఐఎస్‌ను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కార్యదర్శి ముఖర్జీ, తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నుండి సున్నా శాతం వడ్డీతో 50 ఏళ్ల రుణ విరామంతో నిధుల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. సీతారామ సాగర్ ప్రాజెక్ట్‌కు కావాల్సిన అనుమతులను ఒక నెలలోగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

మూసీ నది పునరుద్ధరణకు కేంద్ర సహాయం కోరిన మంత్రి ఉత్తమ్‌లి

మూసీ నది శుద్ధి, పునరుద్ధరణ, అలాగే గోదావరి-మూసీ లింక్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని మంత్రి ఉత్తమ్ కోరారు. ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర మంత్రి, తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

మెడిగడ్డ ప్రాజెక్ట్‌పై నెలాఖరులోపు ఎన్‌డిఎస్‌ఏ నివేదికలి

కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కింద నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఏ) నిర్వహిస్తున్న మెదిగడ్డ ప్రాజెక్ట్ పతనంపై విచారణ ఒక సంవత్సరంగా కొనసాగుతుందని, తక్షణమే నివేదికను విడుదల చేసి, తదుపరి చర్యల కోసం సిఫార్సులు అందించాలని మంత్రి ఉత్తమ్ డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి పాటిల్, నివేదికను నెలాఖరులోగా అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎన్ఎస్‌పీ, శ్రీశైలం ఆనకట్టల మరమ్మతులకు డిఆర్ఐపీ నిధుల వినియోగంలి కేంద్రం సూచించిన విధంగా, వరల్డ్ బ్యాంక్ సహకారంతో అందిస్తున్న డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డిఆర్ఐపీ) నిధులను నాగార్జునసాగర్, శ్రీశైలం ఆనకట్టల మరమ్మతులకు, అలాగే తెలంగాణలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నదీ పరిరక్షణ, మట్టినిక్షేపాల తొలగింపుకు వినియోగించాలని సూచించారు.

కృష్ణా జలాల వివాద పరిష్కారానికి కేంద్ర జోక్యం అవసరంలి

తెలంగాణకు తగిన నీటి వాటా హక్కును సాధించేందుకు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 (కెడబ్ల్యూడీటీ-2) విచారణను వేగవంతం చేయాలని, ఇందులో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ హామీలతో, తెలంగాణ ప్రభుత్వం తన నీటి హక్కుల కోసం పోరాడుతున్న అంశానికి ఈ సమావేశం సంపూర్ణ మద్దతు పలికిందని ఆయన చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతంగా జరగడానికి రెండు రోజుల పాటు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్ పూర్ లో జరిగిన రెండు రోజుల జాతీయ స్థాయి నీటిపారుదల శాఖామంత్రుల సదస్సు ఎంతగానో దోహదపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు

# రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతోంది- కేసీఆర్

మొదటి పేజి తరువాయి




ఇది ఖండించదగ్గ విషయం" అని సీరియస్ టోన్‌తో అన్నారాయన. అయితే.. ఇప్పటికీ మించి పోయింది ఏమీ లేదని.. లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీ కోసం అంతా కష్టపడాలని సూచించారు.

27న భారీ బహిరంగ సభ

ఇక.. ఏప్రిల్‌లో బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఉంటాయని.. ఏడాది పొడవునా ఘనంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఏప్రిల్ 10 నుంచి 27వ తేదీ దాకా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని, ప్రతీ జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని నేతలకు సూచించారాయన.

ఏప్రిల్ 10వ తేదీన పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. అలాగే.. ఏప్రిల్ 27వ తేదీన భారీ బహిరంగ సభ ఉంటుందని ఆయన కేడర్‌కు తెలిపారు. అలాగే బహిరంగ సభ తర్వాత పార్టీ సంస్థాగత కమిటీలను వేయాలని నిర్ణయించిన ఆయన.. ఆ కమిటీలకు ఇంఛార్జిగా సీనియర్ నేత హరీష్ రావు(%ఝుతీఅంష్ట్ర ఝుశీ%)కు బాధ్యతలు అప్పజెప్పారు. అలాగే పార్టీ అనుబంధం సంఘాల పటిష్టతకు సీనియర్ నేతలతో కమిటీలు వేయనున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ లేదా నవంబర్‌లో బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉంటాయని ప్రకటించారు.

భవిష్యత్తు బీఆర్ఎస్‌దే

త్వరలో పార్టీలో సమూల మార్పులు ఉంటాయి. శిక్షణా తరగతులు నిర్వహిస్తాం. మహిళా కమిటీలు ఏర్పాటు చేస్తాం. డీలిమిటేషన్‌తో అసెంబ్లీ స్థానాలు 160 అవుతాయి. అందులో మహిళలకు 53 సీట్లు కేటాయిస్తాం. పోరాడి సాధించుకున్న తెలంగాణ.. ఇప్పుడు అభివృద్ధిలో వెనక్కి పోతోంది. గత గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను అస్థిరతకి తీసుకెళ్తున్నారు. మరోసారి దోపిడీ, వలసవాదుల బారిన పడకుండా కాపాడుకోవాలి. ఈ 25 ఏళ్ల స్ఫూర్తితో కార్యకర్తలు మళ్లీ పోరాడాలి. బీఆర్ఎస్.. తెలంగాణ అస్థిత్వ పార్టీ. బీఆర్ఎస్ అంటే ఒక్కసారి ఓటమితో కొట్టుకుపోయే పార్టీ కాదు. తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతోంది. భవిష్యత్తులో కాంగ్రెస్ మళ్లీ గెలవదు. వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం. ప్రజల కోసం పార్టీ నేతలు, కార్యకర్తలు పని చేయాలి. భవిష్యత్తు బీఆర్ఎస్‌దే. తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయమే బీఆర్ఎస్ లక్ష్యం.

ఉప ఎన్నికలు గ్యారెంటీ

తెలంగాణలో ఉప ఎన్నికలు ఖచ్చితంగా వస్తాయని పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై వేటు పడడం ఖాయం. ఈ అంశంపై నేనే లాయర్లతో మాట్లాడా. తెలంగాణలో త్వరలోనే ఉప ఎన్నికలు రాబోతున్నాయి అని అన్నారాయన.

ఒర్రకండిరా బాబూ..

సుమారు ఏడు నెలల తర్వాత కేసీఆర్ తెలంగాణ భవన్‌కు రావడంతో అక్కడ కోలాహలం నెలకొంది. అయితే.. కేసీఆర్ కార్యాలయానికి చేరుకున్న సమయంలో కేడర్ మధ్య తోపులాట చోటు చేసుకోగా.. ఆయన ఇబ్బంది పడ్డారు. కార్యకర్తలంతా ఆయన్ని చుట్టుముట్టి 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన ఒకింత అసహనానికి లోనయ్యారు. 'ఒర్రకండిరా బాబూ.. మీకు దండం పెడతా..' అంటూ పిలుపు ఇచ్చారు. అయినా కేడర్ చల్లారలేదు. ఈ క్రమంలో తోపులాట చోటు చేసుకోగా.. ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

తెలంగాణ భవన్‌కు కేసీఆర్ వస్తుండటంతో కోలాహలం

కేసీఆర్ పాస్‌పోర్ట్ రెన్యువల్

అంతకు ముందు .. కేసీఆర్ సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి నగరానికి వచ్చారు. ముందుగా సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ డిప్లొమేటిక్ పాస్‌పోర్టును అప్పగించి.. సాధారణ పాస్‌పోర్టును రెన్యువల్ చేసుకున్నారాయన. ఆ టైంలో భార్య శోభ, మాజీ ఎంపీ సంతోష్‌లు వెంట ఉన్నారు. అక్కడి నుంచి బంజారాహిల్స్ నందినగర్‌లోని నివాసానికి చేరుకున్నారు.

## నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా
## కార్యకర్తలతో సమావేశం: నారా లోకేశ్ నిర్ణయం

మొదటి పేజి తరువాయి



భేటీ కావాలని మంత్రి నారా లోకేశ్ నిర్ణయించుకున్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్ కు గ్యారెంటీ, పార్టీ సభ్యత్వం, ఓటర్ వెరిఫికేషన్, మన టీడీపీ యాప్ లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలు, నాయకులతో ఎక్కువ సమయం కేటాయించనున్నారు. అందులో భాగంగానే నేడు తిరుపతిలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేశ్... ముందుగా టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్ లతో పాటు బాబు ష్యూరిటీ-భవిష్యత్ కు గ్యారెంటీ, మన టీడీపీ యాప్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు.

పనిచేసే వారిని ప్రోత్సహిస్తా

పార్టీని బలోపేతం చేసేందుకు నేను సగం రోజు మీతో గడుపుతున్నాను. పార్టీ, ప్రభుత్వం రెండూ అనుసంధానమై ముందుకు పోవాల్సిన అవసరం ఉంది. పార్టీలో నూతనంగా క్లస్టర్, యూనిట్, బూత్ విధానాన్ని తీసుకురావడం జరిగింది. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు.. అన్నా నేను కష్టపడ్డాను.. నన్ను గుర్తించడం లేదని చాలా మంది నాతో చెప్పారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తా. పార్టీ లేకపోతే మనం ఎవరూ లేము అని గుర్తుంచుకోవాలి. ఇవాళ మనకు సమాజంలో గౌరవం లభిస్తోందంటే అందుకు కారణ తెలుగు దేశం పార్టీనే.

కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలి

ఎన్నికల్లో గెలిచాం, తిరుగులేదనే ధోరణి సరికాదు. నిత్యం ప్రజల్లో ఉండాలి. మంగళగిరిలో నేను 91వేల మెజార్టీతో గెలిచా. నాకు ఎంత పని ఒత్తిడి ఉన్నా మంగళగిరి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నా. బాధ్యత పెరిగింది. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలబడాలి. అలకలు మానుకుని నాయకులు సమిష్టిగా పనిచేయాలి. గత ఐదేళ్లలో మనం అనేక కష్టాలు ఎదుర్కొన్నాం. అక్రమ కేసులు పెట్టారు, లాఠీఛార్జి చేశారు. అవన్నీ మర్చిపోకూడదు.

వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

పార్టీ ఏ కార్యక్రమం పిలుపునిచ్చినా కలిసికట్టుగా పనిచేయాలి. ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గ్రూప్ రాజకీయాలకు దూరంగా ఉండాలి. వైసీపీ నేతలు రెడ్ బుక్ గురించి మాట్లాడుతున్నారు. వైసీపీ నాయకులు ప్రజలను, మనల్ని ఇబ్బంది పెట్టారు. తప్పుచేసిన వారిని పద్ధతి ప్రకారం చట్టపరిధిలో శిక్షిస్తాం. వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

కార్పొరేటర్ల తో సమావేశమైన నారా లోకేశ్

కార్యకర్తలతో సమావేశం అనంతరం మంత్రి నారా లోకేశ్ తిరుపతి నగర కార్పొరేటర్లతో సమావేశం అయ్యారు. వార్డుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అధికారులకు ఈటల వార్నింగ్

హైదరాబాద్ : ఐఏఎస్ లు, ఐపీఎస్ లు పబ్లిక్ సర్వెంట్లు.. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హితవు పలికారు. ప్రభుత్వంలోని పెద్దలు చెప్పారని నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే మాజీ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. తాము కూడా ఆరెంజ్ బుక్ మెయింటెయిన్ చేస్తున్నామని ఈటల చెప్పారు. రూల్స్ కు విరుద్ధంగా, ప్రతిపక్ష నేతలను వేధింపులకు గురిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అధికారుల పేర్లను అందులో రాసుకుంటున్నామని తెలిపారు. సమయం వచ్చినపుడు లెక్కలతో బయటపెట్టి ఫలితం అనుభవించేలా చేస్తామని ఈటల పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం వరంగల్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటల ఈ వ్యాఖ్యలు చేశారు. బాస్‌ల ఆదేశాల ప్రకారం కాకుండా, చట్టప్రకారం నడుచుకోవాలని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఈటల సూచించారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా పనిచేస్తే ఎట్టి పరిస్థితుల్లోను ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారానికి వెళ్తే ప్రజలు బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బీఆర్ఎస్ భ్రష్టు పట్టించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ కూడా అదే పద్ధతిలో ముందుకు సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ కు కూడా బీఆర్ఎస్ కు పట్టిన గతే పడుతుందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## చంద్రబాబుకు సెక్యూరిటీ
## కూడా లేకుండా చేస్తా: జగన్



గుంటూరు మిర్చి యార్డ్ పర్యటనకు వైసీపీ అధినేత జగన్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పర్యటనకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన తన పర్యటనకు వెళ్లారు. జగన్ తన పర్యటన సందర్భంగా మిర్చి రైతులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతిపక్ష నేత అయిన తనకు ప్రొటోకాల్ ఇవ్వలేదని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అంటూ... కనీస పోలీస్ భద్రతను కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో మిర్చి రైతులకు అత్యధిక మద్దతు ధర ఇచ్చామని జగన్ చెప్పారు. ఇప్పుడు రైతు సమస్యలపై మాట్లాడేందుకు వస్తుంటే... తనను అడ్డుకున్నారని మండిపడ్డారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని... అప్పుడు చంద్రబాబుకు సెక్యూరిటీ కూడా లేకుండా చేస్తామని వ్యాఖ్యానించారు. రైతుల కష్టాలు చంద్రబాబుకి పట్టడం లేదని విమర్శించారు. జగన్ గుంటూరు పర్యటనకు ఈసీ అనుమతిని నిరాకరించింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిపింది. అయినా ఈసీ ఆదేశాలను ఉల్లంఘించి జగన్ గుంటూరు పర్యటన చేపట్టారు. ఈనాటి పర్యటనపై ఈసీ తదుపరి చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బీర్కూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పోగు పాండు



బీర్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): ఈరోజు ఎమ్మెల్సీ ఎన్నికలు భాగంగా బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశాలు మరియు ఏనుగు రవీందర్ రెడ్డి సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో పట్టభద్రులు అందరు కలిసి గెలిపించాలని ప్రచారం చేయడం జరిగిందని బీర్కూరు మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పోగు పాండు అన్నారు. కిష్టాపూర్ గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిలు, పర్సు గంగాధర్, గోపాల్, కృష్ణారెడ్డి, సాయిలు, రామచందర్, తోట మానిక్, పుల్లారి గంగాధర్, సాయ గౌడ్, కల్ల సాయిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సన్నాహక సమావేశానికి బయలుదేరిన బీర్కూర్ కాంగ్రెస్ శ్రేణులు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశానికి బయలుదేరిన బీర్కూరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ సురేష్ శెట్కార్, పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి లు వస్తున్నట్టు బీర్కూరు మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలను సారం రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ సన్నాక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ రాములు, నాయకులు రఘు,గంగారం,శశికాంత్,శంకర్, హైమద్,గంగాధర్, లాయక్,అరిఫ్,మన్నన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీర్కూర్ లో సబ్ కలెక్టర్ పర్యటన



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పలు ప్రభుత్వ ఆఫీసు సందర్శించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి ప్రభుత్వ ఆసుపత్రుల పైన నమ్మకంతో వస్తున్న రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రం లోని అంగన్వాడీ కేంద్రాలు 1-2 లను సందర్శించారు కేంద్రం లోని చిన్నారులతో సరదాగా ముచ్చటించారు అనంతరం బాలింతలకు గర్భిణులకు అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకం గురించి ఆరాతీశారు. 3 నుండి 6 సంవత్సరాల




పిల్లలు అందిస్తున్న ఆహారం పరిశీలించడం జరిగింది. తరువాత ఆవిడ మాట్లాడుతూ చిన్నారులకు బాలింతలకు, గర్భిణులకు, అందవలసిన సంక్షేమ పథకాలు వారికి అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. బీర్కూరు గ్రామపంచాయతీ అవెన్యూ ప్లాంటేషన్ను సందర్శించి ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్లు పోయడాన్ని పరిశీలించడం జరిగింది. తరువాత కస్తూరిబా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పలుసూచనలు చేశారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్ ను సందర్శించిన ఆవిడ వేసవికాలంలో కరెంటుకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే పట్టణం మరియు గ్రామంలో వేసవికాలంలో నీటి సరఫరా అంతారాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యు.ఓ ప్రమీల, సీడీపీవో సౌభాగ్య, ఎంపిడిఓ భాను ప్రకాష్,తహసిల్దార్ లత, అంగన్వాడీ టీచర్లు శివజ్యోతి, నాగమణిలు పాల్గొన్నారు.



# ఇచ్చిన హామీలు నేరవర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):బి ఆర్ ఎస్ పార్టీ కన్నాయిగూడెం సోషల్ మీడియా కావిరి అంజన్ రావు నేత ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయడం లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బి ఆర్ ఎస్ పార్టీ కన్నాయిగూడెం సోషల్ మీడియా కావిరి అంజన్ రావు నేతప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా హామీలు మాత్రం అమలు కావడం లేదన్నారు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేస్తామన్నారు.

# మరాఠా సామ్రాజ్య వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

### ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) ఛత్రపతి శివాజీ మహారాజ్, ఫిబ్రవరి 19, 1630న శివనేరి కొండ కోటలో జన్మించారు, ప్రముఖ మరాఠా యోధుడు మరియు పశ్చిమ భారతదేశంలో మరాఠా సామ్రాజ్య స్థాపకుడు అని మద్దెల దినేష్ పేర్కొన్నారు. గోదావరిఖని లోని 33వ డివిజన్ లో శివాజీ మహారాజ్ 395వ జయంతిని డివిజన్ ప్రజల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగిందని స్థానిక డివిజన్ యువకడు వడ్లకొండ అకాష్ గౌడ్అధ్యక్షతన జరిగింది. అనంతరం ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మాట్లాడుతూ శివాజి గారి జీవితం మరియు వారసత్వం భారత చరిత్రలో చెరగని ముద్ర వేసిందిని మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ప్రతిఘటన స్ఫూర్తిని మరియుస్వపరిపాలన కోసం తపనను మూర్తీభవించిందన్నారు. శివాజీ మరాఠా సైన్యాధిపతి షాహాజీ భోంస్లే మరియు జీజాబాయి దంపతులకు జన్మించారని, ఆయన బోధనలు ఆయన బాల్య జీవితాన్ని



తీవ్రంగా ప్రభావితం చేశాయని, జీజాబాయి ఆయనలో తమ భూమి మరియు ప్రజల పట్ల గర్వం మరియు బాధ్యతను నింపారన్నారు. చిన్నప్పటి నుంచీ శివాజీ అసాధారణమైన నాయకత్వ లక్షణాలను మరియు బలమైన న్యాయ భావాన్నిప్రదర్శించేవారన్నారు. దాదాపు 16 సంవత్సరాల వయస్సులో, శివాజీ నమ్మకమైన అనుచరుల బృందాన్ని సమీకరించి, మరాఠా రాజ్యాన్ని స్థాపించడానికి తన ప్రచారాన్ని ప్రారంభించాడని, 1645 లో అతను తన మొదటి కోట అయిన టోర్నాను స్వాధీనం చేసుకున్నాడు, ఇదినాయకుడిగాతనప్రయాణానికి నాందిపలికిందన్నారు. తరువాతి కొన్ని సంవత్సరాలలో, అతను వ్యూహాత్మకంగా అనేక కోటలు మరియుభూభాగాలనుసంపాదించాడని గెరిల్లా యుద్ధ వ్యూహాలను ఉపయోగించాడని, అది అతని ట్రేడ్‌మార్క్‌గా మారిందన్నారు. శివాజీ జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టాలలో ఒకటి జూన్ 6, 1674న రాయ్‌గఢ్ కోటలో ఛత్రపతిగా పట్టాభిషేకం, ఈ సంఘటన సార్వభౌమత్వాన్ని ప్రకటించడం మరియు మరాఠా సామ్రాజ్యాన్ని అధికారికంగా స్థాపించడం, గొప్ప వైభవంగా నిర్వహించిన పట్టాభిషేక కార్యక్రమంలో, స్వతంత్ర పాలకుడిగా ఆయన చట్టబద్ధతను నొక్కి చెప్పే ఆచారాలు మరియు ఆచారాలు ఉన్నాయన్నారు. మొఘల్ ఆధిపత్యం నుండి స్వయంప్రతిపత్తి కోసం మరాఠాల ఆకాంక్షను సూచించే ఒక సంకేత క్షణం అన్నారు. శివాజీ పరిపాలన ప్రగతిశీల విధానాలు మరియు సమర్థవంతమైన పాలనతో గుర్తించబడిందని తీరప్రాంతాలను కాపాడటంలో నావికా ఆధిపత్యం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, అతను ఒక బలమైన నావికా దళాన్ని స్థాపించాడు. అతని పరిపాలనా సంస్కరణలలో క్రమశిక్షణ కలిగిన సైనిక నిర్మాణాన్ని సృష్టించడం, ఆదాయ సంస్కరణలను ప్రవేశపెట్టడం మరియు వాణిజ్యాన్ని ప్రోత్సహించడం ఉన్నాయి. అతను మత సహనాన్ని కూడా నొక్కి చెప్పాడు మరియు విభిన్న సమాజానికి మద్దతు ఇచ్చాడు, తన ప్రజలందరికీ న్యాయం జరిగేలా చూసుకున్నాడన్నారు. శివాజీ మొఘల్ సామ్రాజ్యంతో మరియు ఇతర పొరుగు రాష్ట్రాలతో నిరంతరం ఘర్షణలో ఉన్నాడు. 1666లో ఔరంగజేబు ఖైదు చేసిన తర్వాత ఆగ్రా నుండి తప్పించుకోవడం అతని చాతుర్యం మరియు దృఢ సంకల్పాన్ని ప్రదర్శించింది. ఈ సాహసోపేతమైన చాకచక్యమైన మరియు దృఢమైన నాయకుడిగా అతని ఖ్యాతిని పదిలం చేసింది. శివాజీ మహారాజ్ ఏప్రిల్ 3, 1680న రాయ్‌గడ్ కోటలో మరణించాడు. అతని మరణం శూన్యాన్ని మిగిల్చింది, కానీ అతని వారసత్వం అతని వారసులు మరియు మరాఠా సామ్రాజ్యం ద్వారాకొనసాగింది, ఇది మొఘల్ అధికారాన్ని సవాలు చేస్తూ మరియు దాని భూభాగాలను విస్తరించడంకొనసాగించిందన్నారు. శివాజీ మహారాజ్ జీవిత కథ ఆయన దార్శనికత, ధైర్యం మరియునాయకత్వానికి నిదర్శనం. ఫిబ్రవరి 19, 1630న ఆయన జననం మరియు జూన్ 6, 1674న ఆయన పట్టాభిషేకం, ఆయన విశిష్ట ప్రయాణం ప్రారంభం మరియు శిఖరాన్ని సూచించే రెండు కీలకమైన తేదీలు. మరాఠా గుర్తింపుకు మరియు వలసవాద మరియు సామ్రాజ్య శక్తులకు వ్యతిరేకంగా విస్తృత భారతీయ ప్రతిఘటనకు ఆయన చేసిన కృషికి గాను ఆయన భారత చరిత్రలో గౌరవనీయమైన వ్యక్తిగా నిలిచిపోయరని నేటి యువత వారి ఆదర్శంతో ముందుకు సాగాలని అన్నారు. అనంతరం వడ్లకొండ అకాష్ గౌడ్ జెండా ఆవిష్కరించారు. ఇంకా డివిజన్ పెద్దమనుషులుమరియుమహిళలు,యువకులు మేదరి శ్రీనివాస్, పెరక శ్రీనివాస్, మద్దెల రామస్వామి, తలపల్లి రవి, రమేష్, అభి, పద్మ, అర్చన, సుజాత, మౌనిక, రజిని, భావని, తులసిలత, అనిత, సుమలత, అనసూర్య, ప్రేమ లత, వెంకటమ్మ, శ్రీదేవి, శ్రీలత, శేషిరేఖ, అనూష, స్వరూప, అరుణ, పొగాకు గోవర్ధన్,దేగ శ్రీనివాస్, బిట్టు అశోక్, అభిలాష్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన జ్వాలా చారిటబుల్ ట్రస్ట్




మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):ఈ రోజు శ్రీ ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారుఈ సందర్భంగా కోడెల నరేష్ మాట్లాడుతూ భరతమాత మొగలుల గుప్పిట్లో చిక్కుకుని విలవిలలాడుతున్న సమయంలో ఓ శక్తి ఈ గడ్డ పై పురుడు పోసుకుంది ఖడ్గం చేతపూని ప్రళయకాల రుద్రరూపాన్ని ధరించింది మొఘలుల సామ్రాజ్యపు పునాధుల్ని బద్ధలుగొట్టింది దుర్గమమైన మార్గం లో ఓటమన్నదే లేకుండా ఒక్కో దుర్గాన్ని జయిస్తూ మహాసామ్రాజ్యాన్ని స్థాపించి భారతజాతికి ఉపిరిలూది కొత్త జవసత్వాలిచ్చింది ఆ శక్తి పేరే ఛత్రపతి శివాజీ ఆ కారణ జన్ముడికి మనం ఎంతో రుణపడి ఉంటామని ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ అన్నారు ఈ కారిక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ , ట్రస్ట్ సభ్యులు పందిరి మోహన్ ,మైల మల్లికార్జున్,మట్టం మహేష్, సీలోజు శ్రీనివాస్,నుతులకంటి కృష్ణ, భూక్య కుమార్, ఆదినారాయణ, సతీష్,మహేష్,వెంకటేష్ ,రవి శ్రీను మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ నిఖిలేష్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) అంతర్గాం మండలం బుధవారం రోజున బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్ దగ్గర కొత్తగా ఎస్ ఎస్ నిఖిలేష్ పెట్రోల్ బంక్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్. అనంతరం ఎస్ఎస్ నిఖిలేష్ పెట్రోల్ బంక్



యజమానికి మరియు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్. ఈ కార్యక్రమంలో అంతర్గం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

# రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్ లిమిటెడ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నూతన కమిటీ

### గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

### ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులుగా నెలకంటి రాము



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) స్థానిక మార్కండే కాలనీ దుర్గా నగర్ లక్ష్మీప్రసన్న గార్డెన్ లో బుధవారం రోజున రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్ లిమిటెడ్ ఆర్ ఎఫ్ సి ఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఏకగ్రీవంగా 250 సంతకాలతో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది సంఘం గౌరవ అధ్యక్షులుగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ని ఎన్నుకోగా అధ్యక్షునిగా నెలకంటి రాముని ఎన్నుకోవడం జరిగింది మిగతా కమిటీని ఆర్ ఎఫ్ సి ఎల్ కార్మికుల సెక్షన్ వైజ్ గా మరియు గ్రామాల కార్పొరేషన్ సంబంధించి తాజా



మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు పూర్తి కమిటీని ఎమ్మెల్యే సమక్షంలో నియమించడం జరుగుతుంది. ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ చిట్టి పోయిన రాజ్ కుమార్, మాజీ కార్పొరేటర్ కందుల సతీష్, బూర్ల, శ్రీను కన్నూరి శంకర్ ధబేటా, మల్లేష్ ఎరుకల అంజి రమేష్ రెడ్డి, ధాతు శ్రీను, దూస రాజేష జనగామ శ్రీనాథ్, డి.సందీప్, పన్నాల శ్రీను, మట్టపల్లి సంజీవ్,పంబాల తరుణ్ అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ కొలిపాక వెంకటస్వామి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించండి



వరంగల్ జిల్లా,( శుభోదయం న్యూస్): తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరంగల్ కాశిబుగ్గ పంతొమ్మిదోవ డివిజన్ లో రాష్ట్ర కారదర్శి గోగికార్ అధ్యక్షతన సమావేశం జరిగినది. ముఖ్య అతిథులగా తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాపగిరి విజయ్ కుమార్ మాట్లాడుతూ వరంగల్ నల్లగొండ ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం యం ఎల్ సీ గా బరిలో వున్నా (టి ఎస్ సి పి ఎం యు) అభ్యర్థి డా. కొలిపాక వెంకటస్వామి గారికి జరుగబోయే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించగలరని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తూ దేశానికి స్వతంత్ర%శీ% వచ్చిన నాటి నుండి నేటి వరకు విద్య ఉద్యోగం ఉపాధి రాజకీయ రంగాలలో వెనుకబడి వున్నారని అనేక సంవత్సరాలనుండి ఈ యొక్క వర్గాల అభివృద్ధి కొరకు కృషి చేయలేక పోయారని ప్రస్తుతం రాష్ట్రం లో బడుగు బలహీన వర్గాల హక్కులు సాదించుకోవడం కోసం బీసీలు రాజకీయల్లో క్రియ శిలకంగా పనిచేస్తూ ప్రజా ప్రతినిధులు గా రావాల్సిన అవసరం ఉందని భావిస్తూ అందులో భాగంగానే డా. కొలిపాక వెంకటస్వామి గారు ప్రభుత్వ డాక్టర్ అయివుండి తాను ఉద్యోగరీత్యా యం బీ బీ ఎస్ విద్యార్థులకు విద్య ను బోదిస్తూ అలాగే అనేక సామజికంగా సేవా కార్యక్రమాలు చేస్తూ డాక్టర్ గా నిరుపేదలకు ఉచిత వైద్యం సహాయం అందిస్తూ తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ద్వారా జరిపిన అనేక ఉద్యమలలో పాల్గొంటు తన బాధ్యత గా కృషి చేయడం జరుగుతుంది, అలాంటి వ్యక్తి అయినటువంటి వీరు తన ప్రభుత్వ ఉద్యోగం కు రాజీనామా చేసి ఈ సమాజానికి సేవా చేయాలనీ గొప్ప సంకల్పం తో వచ్చారు,బీసీ కులాలలో నాయి బ్రాహ్మణ (ఎంబీసీ) సామజిక వర్గానికి చెందిన వారు కాబట్టి వారికి తప్పనిసరిగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించగలరని అన్నీ వర్గాల వారిని కోరారు.... ఈ సమావేశంలో బీసీ బహుజన రాష్ట్ర ఉపాధ్యక్షులు బర్కం రామ్ మోహన్ గంగపుత్ర, రాష్ట్ర కార్యదర్శి దొడ్డిపాటి శేఖర్ రజక, రాష్ట్ర నాయకులు,బేతి రాజు పద్మశాలి, ఎదులాపురం బ్రాహ్మాచారి, ఆరికల రవి నేత, నాయకులు అల్లేపు శ్యామసుందర్ వడ్డెర,తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవి కోసం మంత్రిని కలిసిన మహేష్



వరంగల్ జిల్లా, (శుభోదయం న్యూస్ ): నగర పరిధిలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ బుధవారం హనుమకొండ రాంనగర్ నివాసంలో అటవీ, పర్యాటక మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు తప్పకుండా ఈ విషయంలో చొరవ తీసుకొని బాధ్యత గల నామినేటెడ్ పదవి ఇప్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టి సెల్ డివిజన్ అధ్యక్షుడు పులిచేరి రాధాకృష్ణ. సౌరం అభిలాష్. కోగిల సుధాకర్ పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి : మంత్రి కొండా సురేఖ



వరంగల్ జిల్లా,( శుభోదయం న్యూస్ ): అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ హనుమకొండ రామ్ నగర్ లోని తమ నివాసంలో వరుసగా రెండో రోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు హనుమకొండలోని తమ నివాసనికి చేరుకుని తమ సమస్యలను మంత్రి గారికి విన్నవించారు. వారి సాధకబాధకాలను మంత్రి సురేఖ సహృదయంతో విన్నారు. వారి సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార నిమిత్తం మున్సిపల్, రెవెన్యూ తదితర విభాగాలకు చెందిన పలువురు అధికారులతో మాట్లాడారు. అవసరార్థులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని మంత్రి సురేఖ ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని మంత్రి సురేఖ వారికి భరోసానిచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా కొండా దంపతులు అందుబాటులో ఉంటారని కార్యకర్తలకు నాయకులకు ఏ ఆపద వచ్చిన కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ వారికి భరోసా ఇచ్చారు.

## శంకర్‌పల్లిలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి :
## మండల బిజెపి అధ్యక్షురాలు లీలావతి బయానంద్



ప్రతినిధి/ శంకర్‌పల్లి (శుభోదయం న్యూస్) : హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు ఛత్రపతి శివాజీ అని శంకర్‌పల్లి మండల బిజెపి అధ్యక్షురాలు లీలావతి బయానంద్ అన్నారు. బుధవారం చత్రపతి శివాజీ రాజే భోంస్లే మహారాజ్ జయంతి సందర్భంగా మండల పరిధి పలు గ్రామాలలో ఆమె చత్రపతి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత దేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరతమాత ముద్దుబిడ్డ, స్త్రీని గౌరవించి హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు చత్రపతి శివాజీ అని కొనియాడారు. భరతమాత మొఘలుల గుప్పిట్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న సమయంలో ఓ శక్తి ఈ గడ్డపై పురుడు పోసుకుంది. ఖడ్గం చేత పూని ప్రళయ కాల రుద్రరూపాన్ని ధరించింది. మొఘల్ సామ్రాజ్యపు పునాదుల్ని బద్దలుగొట్టింది. దుర్గమమైన మార్గంలో ఓటమన్నదే లేకుండా ఒక్కో దుర్గాన్ని జయిస్తూ మహా సామ్రాజ్యాన్ని స్థాపించింది. భరతజాతికి ఊపిరిలూది కొత్త జవసత్వాలిచ్చింది. ఆ శక్తి పేరే ఛత్రపతి శివాజీ అని లీలావతి భయానంద్ పేర్కొన్నారు. స్వేచ్ఛ అనేది ఒక వరం, దీనిని ప్రతి ఒక్కరూ పొందే హక్కు ఉంది. స్త్రీలకున్న హక్కుల్లో గొప్పది తల్లికావడమే. మీరు మీ లక్ష్యాలను ప్రేమించడం ప్రారంభించినప్పుడు, మీకు అడ్డంకులు కనిపించవు ముందున్న మార్గం మాత్రమే కనిపిస్తుంది. మీరు ఉత్సాహంగా ఉన్నప్పుడు, పర్వతం కూడా మట్టి కుప్పలా కనిపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ సేవాసమితి
## ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు



రామగుండం మండలం రిపోర్టర్–తిరుపతి, (శుభోదయం న్యూస్) శ్రీ సీతారామ సేవా సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం సభ్యులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. పాపం గూడూరి సుశీల దేవి. ఒక సాధారణ మహిళ. భర్త ఫోటో శ్యామ్ సుందర్ గ్రాఫర్. వారి సంపాదన అంతంత మాత్రమే. ఈ మధ్యతరగతి కుటుంబాన్ని ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు.మరో వైపు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. సుశీల దేవి కొంత కాలంగా పెద్దపేగు క్యాన్సర్, గాల్ బ్లాడర్ లో స్టోన్స్, ఎర్నియా, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతోంది. పరిస్థితి విషమంగా ఉండడంతో గత 15 రోజులుగా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, తన అనారోగ్య సమస్యలపై ఆందోళన చెందుతున్న సుశీల దేవి కంటిమీద కునుకులేకుండా తల్లడిల్లుతోంది.బాధితురాలి దీనస్థితికి చలించిన శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు బాధిత మహిళ దీనస్థితి తెలుసుకున్న ఎన్టీపీసీ లోని శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ చలించిపోయారు.తోటి గ్రూప్ సభ్యుల సహకారంతో బుధవారం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సుశీల దేవిని కలుసుకొని పరామర్శించారు. మానసిక ధైర్యం కల్పించి, రూ.5,000 ఆర్థిక సహాయాన్నిఅందజేశారు. బాధిత మహిళను ఆదుకోవడానికి మనవతావాదులు ముందుకు రావాలని చంద్రకళపిలుపునిచ్చారు. మరో పేదింటి కుటుంబానికి తక్షణ సాయం సుల్తానాబాద్ లోని పూసాల గ్రామానికి చెందిన నిరుపేద అనవేన కనకమ్మ దశదిన కార్యక్రమం కోసం ఆమె భర్త పోచాలుకు రూ.2,000 ఆర్థిక సహాయం కూడా అందజేసారు. వేరువేరుగా జరిగిన ఈ



కార్యక్రమాల్లో శ్రీ సీతరామ సేవ సమితి కమిటీ సభ్యులు, లక్ష్మినారాయణ, కంకణాల కరుణాకర్ తో పాటు ఆస్పత్రిలో జరిగినకార్యక్రమంలో గోలివాడ చంద్రకళ, కంది సుజాత, జనగాం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ ల లో అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్

(స్థానిక సంస్థలు) రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ



రామగుండం మండలం రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్) పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ బుధవారం నగరం లోని వివిధ డివిజన్ లను సందర్శించి పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 48, 42, 50 లక్ష్మీ నగర్ , కళ్యాణ్ నగర్ లలో పురోగతి లో ఉన్న రోడ్ల వెడల్పు , సి సి రోడ్ల నిర్మాణం , విద్యుత్ స్తంభాల ఏర్పాటు , నీటి సరఫరా పైప్ లైన్లు , నల్లా కనెక్షన్ పనులను పరిశీలించారు. అలాగే 6, 7 డివిజన్ ల లోని ఐ బి కాలనీ , సప్త గిరి కాలనీ , పవర్ హౌజ్ కాలనీ లలో జరుగుతున్న వరద కాలువ నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. అంతకుముందు తిలక్



నగర్ లో మణి చంద్ర మహిళా స్వశక్తి సంఘం బ్యాంక్ లింకేజ్ రుణం పొంది ఎంబ్రాయిడరీ కుట్టు యంత్రాన్ని కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి యూనిట్ ను సందర్శించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం మెప్మా ఆర్ పి లతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించి స్వచ్ఛ సర్వేక్షణ్ పౌర స్పందన ( సిటిజెన్ ఫీడ్ బ్యాక్ ) ప్రాధాన్యత వివరించారు. స్వశక్తి మహిళలకు , ప్రజలకు సిటిజెన్ ఫీడ్ బ్యాక్ పై అవగాహన కల్పించి రామగుండం నగర%శీ% మెరుగైన ర్యాంక్ సాధించడానికి ఆర్ పి లు సహకరించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో వార్డు అధికారులతో సమన్వయంతో పని చేయాలని అన్నారు. అర్హులైన వారిని గుర్తించి కొత్త స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేయించాలని అన్నారు. పథకాలపై అవగాహన కల్పించి స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. తీసుకున్న రుణాలను స్వశక్తి మహిళలు సకాలంలో తిరిగి చెల్లించేలా అవగాహన కల్పించి వడ్డీ మినహాయింపుకు అర్హులయ్యేలా చూడాలని అన్నారు. ఈ సంధర్భంగా నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఎస్ ఇ శివానంద్ , ఇ ఇ రామన్ , సానిటరీ ఇన్స్పెక్టర్ లు నాగ భూషణం , కుమార స్వామి , సునీల్ రాథోడ్ , ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్ , మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ మౌనిక , ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , కమ్యూనిటి ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## దుండిగల్ గ్రామ పరిధిలోని చిన్న దామర చెరువుని పరిశీలించిన...

ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ ఉదయ్ భాస్కర్



కుత్బుల్లాపూర్, శుభోదయం న్యూస్ : ఈ రోజు దుండిగల్ గ్రామ పరిధిలోని చిన్న దామర చెరువుని పరిశీలించిన ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ ఉదయ్ భాస్కర్ మరియు అసిస్టెంట్ ఇంజనీర్ స్వప్న గారు చిన్న దామర చెరువు అలుగునీ యథావిధిగా పునరుదించాలని ముదిరాజ్ సంఘం సభ్యులకు ఆదేశించారు మరియు ప్రతిపాదనలను పంపించిచెరువులోకి మురుగు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో



మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షుడు కావాలి గణేష్ మరియు మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి మాజీ ఎంపీటీసీ బండారి మహేష్ మాజీ వార్డు సభ్యుడు పిట్లా సత్యనారాయణ ముదిరాజ్ మరియు ముదిరాజ్ సంఘం సభ్యులు మరియు ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ జయంతి



పరకాల నియోజకవర్గం, (శుభోదయం న్యూస్): చత్రపతి శివాజీ జయంతిఉత్సవం సందర్భంగా..మన తెలంగాణ రాష్ట్రంలో ఆరె కుల సంక్షేమ సంఘం..భూమి పూజ కార్యక్రమం హైదరాబాదులో భగత్ ఉప్పల్ పూజా కార్యక్రమం జరిగింది...ఈ కార్యక్రమానికి ఆరె కుల సంక్షేమ సంఘం. స్టీరింగ్ కమిటీ చైర్మన్ .లింగంపల్లి కిషన్ రావు.. ఆరెకుల సంక్షేమ సంఘం.రాష్ట్ర అధ్యక్షులు. ఆర్ చలపతిరావు . ఆధ్వర్యంలో విజయవంతంగా పూజ కార్యక్రమం జరిగినాయి . జై భవాని జై శివాజీ..

## అడ్డగుట్ట డివిజన్ బుద్ధ నగర్ లో బస్తీ సమస్యలు, నీటి సమస్యలు పట్టించుకోని స్థానిక కార్పొరేటర్..

సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు..

బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్న అడ్డగుట్ట ఇంచార్జ్ ఆదం భరత్ కుమార్..





తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ బుద్ధ నగర్ లో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు, అడ్డగుట్ట డివిజన్ ఇంచార్జ్ ఆదం భరత్ కుమార్ బస్తీ పర్యటన చేపట్టి,బస్తీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ బస్తీ సమస్యలు, నీటి సమస్యలు, బోర్లు, డ్రైనేజీ సమస్యలు పట్టించుకోవడంలేదని బస్తీ వాసులు తమ దృష్టికి తీసుకువచ్చారు అన్నారు. వెంటనే స్పందించి బస్తీలో పర్యటించి బస్తీ సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ యొక్క సమస్యలను సంబంధిత అధికారులకు చేరవేసి త్వరగా పరిష్కారం చేస్తాము అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేట నూతన ఎస్సై గా వెంకట్రావు.



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్ ):- లింగంపేట ఎస్సైగా వెంకట్రావు ను బుధవారం ఉన్నతాధికారు లు నియమించారు. ఏఎస్ఐ గా పని చేసిన వెంకట్రావు. పదోన్నతి పై ఎస్సైగా లింగంపేట్ కు బదిలీపై వచ్చారు. ఎస్ఐ వెంకట్రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కు కృషి చేస్తానని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీ తిరగడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలను అరికడుతామన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఎస్సై లు ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం విధితమే.ఇకనుండి అలాంటివి జరుగవని ఎస్సై వెంకట్రావు అన్నారు.

## బీర్కూరులో ఘనంగా హిందు హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు.



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రం లో ఘనంగా హిందు హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు లు నిర్వహించారు. ముందుగా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కాషాయ జెండా ఎగురవేసిన అనంతరం ఛత్రపతి శివాజీ గురించి యువనాయకులు శశికాంత్ మాట్లాడుతూ తల్లి పేరు జిజియా భాయి ఆ కొడుకు పేరు శివాజీ భోంస్లే ఛత్రపతి శివాజీ మహారాజ్తన పదిహేడవ ఏట ప్రారంభించిన ఉద్యమంతో జీవితాంతం అలుపెరగని పోరాటాలు చేసిదాదాపుగా మొఘలుల పాలనకు స్వస్తి చెప్పి మరాఠ దేశంలో అన్ని ప్రాంతాలనూ కోటలనూ కైవసం



చేసుకునిధర్మగ్లాని గావిస్తున్న వారి శిరచ్ఛేధనం చేసి ధర్మాన్ని నాలుగు పాదాలపై మొహరింపజేసి యావద్భారతావనీ జయహో ఛత్రపతి అనే విధంగా పరిపాలన సాగించి అజరామర కీర్తి ప్రతిష్టలు కైవసం చేసుకున్న మన శివాజీ మహారాజ్ జయంతి అని ఆయన అన్నారు ఈ వేడుకలు హిందువాహిని, బజరంగ్దళ్ మరియు బీర్కూరు పట్టణ యువకుల ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువకులతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం లో కర్ణకంటి ప్రవీణ్ వడ్ల బస్వరాజు, బీరుగొండా,అశోక్,కొర్రి అనిల్,కొట్టం విట్టల్, వీరు, తరుణ్,రాహుల్ ఠాకూర్, భారీ ఎత్తున యువత పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం లో పాల్గొన్న మంత్రి జూపల్లి



బీర్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ నరేందర్ రెడ్డి గారికి మద్దతుగా బాన్సువాడ పట్టణ శివారులోని ఎస్ఎంబి ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి నిజామాబాద్ - మెదక్ - అదిలాబాద్ - కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసినటువంటి పట్టభద్రుల ఎన్నికల సమావేశంలో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు, రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి వర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ సురేష్ షెట్కర్ గారు, రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీ కాసుల బాలరాజు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారు ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి గారు మాట్లాడుతూ....బాన్సువాడ నియోజకవర్గంలోని పట్టభద్రులు ఈనెల 27 వ తేదీన జరగనున్న ఎన్నికలలో తమ అమూల్యమైన ఓటును మన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ నరేందర్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారుఈ



కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,నాయకులు,పట్టభద్రులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## గోదావరిఖని చౌరస్తా లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు

ముఖ్యఅతిథిగా హాజరైన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) గోదావరిఖని చౌరస్తా లో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ 395వ జయంతి ఉత్సవాలు. అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ప్రాంతంలోని ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్,శివాజీ మహారాజ్ చిత్రపటానికి



పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధుడు మాత్రమే కాకుండా, సమతా రాజ్య స్థాపనకు పాటుపడిన మహానేత అని పేర్కొన్నారు.ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా సంగీతం, డాన్స్, శోభాయాత్ర వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు ప్రాంతీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలు కొన్ని రోజుల పాటు కొనసాగి, చివరిదినానికి శివాజీ మహారాజ్ ఆశయాల స్ఫూర్తితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. గోదావరిఖని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు తాజా మాజీ కార్పొరేటర్లు సంబంధిత కమిటీ సభ్యులు తదితరులున్నారు.

## చింతకాని ఎస్సై..వైరా సీఐని తక్షణమే సస్పెండ్ చేయాలి : మాదిగ దండోరా



మధిర ఇంచార్జి: అర్ పి రమేష్ (శుభోదయం న్యూస్):చింతకాని ఎస్సై..వైరా సీఐని తక్షణమే సస్పెండ్ చేయాలని,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైరా డీఎస్పీని కలిశారు ఎమ్మార్పీఎస్‌రాష్ట్ర జిల్లా నాయకులు.దళిత యువకులపై దాడి గులకాల గోవిందాపురం మాదిగలపై కులం అహంకారంతో అధికార బలంతో మాదిగ యువకులపై కులం పేరుతో దూషించిన కమ్మ సామాజిక వర్గానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ లీడర్ మాదిగ యువకులపై దాడి చేసి కమ్మ సామాజిక వర్గం. దాడికి గురి అయిన మాదిగ బిడ్డలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారులు అధికార పార్టీ అండదండలతో బాధితులపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం . పోలీస్ స్టేషన్లో చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మాదిగ యువకులపై లాఠీ తో ఇష్టానుసారంగా కొట్టటం మాదిగల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం.వైరా డీఎస్పీని..కలవడం జరిగింది .. మాదిగ యువకులపై దాడి చేసిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై ఎస్సీ.ఎస్టీ అట్రాసిటీ. ఎస్ఐ సీఐపై కూడానమోదు చేయాలి తక్షణమే సస్పెండ్ చేయాలి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జిల్లా కమిటీ లు డిమాండ్ చేశాయి.పోలీసులు కాంగ్రెస్ పార్టీ లీడర్ అధికార అహంకారంతో అతను మాటలు విని కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తుల.చేతుల్లో..పోలీసుల..చేతుల్లో దాడికి గురైన బాధితులకు ఎమ్మార్పీఎస్ అండగా నిలిచింది. చింతకాని ఎస్ఐ వైరా సీఐని తక్షణమే సస్పెండ్ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాత్రి 10 గంటల వరకు డిఎస్పీ ఆఫీసులో చర్చలు నిర్వహించడం జరిగింది.చింతకాని ఎస్ఐ వైరా సీఐని సస్పెండ్ చేస్తానని మాదిగ యువకులపై దాడి చేసిన కమ్మ కులమునకు.సంబంధించి వారిపై.ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేస్తానని.. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జిల్లా కమిటీకి..హామీ.ఇవ్వడం జరిగింది.రెండు నుండి మూడు రోజుల్లో సీఐ. ఎస్ఐ.లపై అట్రాసిటీ కేసులో అరెస్టు చెయ్యకపోయినా సస్పెండ్ చెయ్యకపోయిన తదుపరి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటామని తెలియజేశారు.

## ఛత్రపతి శివాజీ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా హిందూ మహారాజ్ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



జిన్నారం : (శుభోదయం న్యూస్)జిన్నారం మండలం పెద్దమ్మ గూడెం చౌరస్తాలో ఉన్నటువంటి ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క జయంతి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు గుర్రాల సత్యనారాయణ యాదవ్,జనరల్ సెక్రటరీ సీతరాజు యాదవ్,మరియు సంఘం సభ్యులు జి శ్రీనివాస్, జి నర్సింలు, డి రాజు, జి వెంకటేష్, ఎస్ మహేష్ మరియు హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు వడ్ల ఆనంద్ చారి , గాండ్ల బ్రహ్మేందర్, విష్ణుమూర్తి,అశోక్ చారి,అశోక్ ,గాండ్ల శ్రీనివాస్, శివ స్వామి అలాగే వివిధ పార్టీల నాయకులు వంగేటి ప్రతాప్ రెడ్డి,గొర్ల శ్రీనివాస్ యాదవ్,పుట్టి భాస్కర్ ,మంద రమేష్,బండి శ్రీకాంత్, శ్రీనివాస్, జిన్నారం రాజు, వీరేష్,ఆంజనేయులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయానికి స్లాప్ ప్రారంభోత్సవం చేసిన బిఆర్ఎస్ నాయకులు బాలగోని సాయి చరణ్ గౌడ్



జిన్నారం : (శుభోదయం న్యూస్) జిన్నారం మండల కేంద్రంలో పోచమ్మ తల్లి ఆలయానికి స్లాబ్ ప్రారంభోత్సవం చేసిన బాలగోని సాయి చరణ్ గౌడ్. హామీ ఇచ్చిన ప్రకారం మంగళవారం నాడు ప్రారంభోత్సవం చేసిన సాయి చరణ్ గౌడు కు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సాయి చరణ్ గౌడ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి దేవాలయానికి నా వంతు సహకారం అందించానని నాకు చాలా సంతోషంగా ఉందని అమ్మవారి ఆలయ నిర్మాణంలో నాకు అవకాశం కల్పించిన గ్రామస్తులకు ఆలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ ఎల్లవేళలా అమ్మవారి దయ కటాక్షం ఉంటుందని అమ్మవారిని వేడుకోవడం జరిగింది. ముందుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఆయనకు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నరసింహ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్లు ఏర్పుల లింగం, తోట నర్సింగరావు, మంద రమేష్, నీలం మోహన్, ఊట్ల మాజీ సర్పంచ్ ఆంజనేయులు, బండి శ్రీకాంత్ గౌడ్, నిఖిల్ గౌడ్, ఏర్పుల భాస్కర్, జోగు వెంకటేష్, ఏర్పుల నర్సింలు, పోచమ్మల ఎల్లయ్య, కర్నే పోచయ్య, ఏర్పుల శేఖర్, ఏర్పుల గోపాల్, పోచమ్మ నాగులు, దుర్గయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో ఘనంగా శివాజీ జయంతి ర్యాలీ



పటాన్చెరు : (శుభోదయం న్యూస్)పటాన్‌చెరు వీర శివాజీ యువసేన మరియు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలో శివాజీ జయంతి ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు వేలాది మంది యువకులు హాజరై, దేశభక్తిని ప్రదర్శించారు.ర్యాలీ పాండవ్యాల తాళం, సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి నినాదాలు మధ్య ఎంతో వైభవంగా ప్రారంభమైంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ యొక్క సాహస, ధైర్యం, ధర్మ నిబద్ధత యువతకు స్ఫూర్తిగా నిలిచేలా వేడుకలు సాగాయి.ఈ కార్యక్రమానికి వివిధ సామాజిక, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరై, శివాజీ జీవిత గాథను వివరించారు. యువత శివాజీ మహారాజ్ సిద్ధాంతాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. కేసరియా జెండాలు పట్టుకుని, శివాజీ నినాదాలతో యువకులు పట్టణ వీధులను కాంతిమంతం చేశారు.స్థానిక ప్రముఖులు, సంఘ నాయకులు శివాజీ మహారాజ్ సేవలు, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి విలువలు గురించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో క్రమశిక్షణ, ఐక్యత, శాంతి వాతావరణాన్ని కొనసాగించేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి నివాళులర్పించి, ఆయన సిద్ధాంతాలను పాటించేలా ప్రతిజ్ఞ చేశారు. నిర్వాహకులు ఈ విజయవంతమైన కార్యక్రమానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టు కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ కుమార్, మధుసూదన్ రెడ్డి,పృథ్వీరాజ్,తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ నియోజకవర్గంలో తూముకుంట నర్సారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన.... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నీలం మధు



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నీలం మధు ముదిరాజ్



పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ కు మరియు నర్సారెడ్డికి గజమాల తో సత్కరించిన ములుగు మండల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జోగిని రవి ముదిరాజ్, మరియు గజ్వేల్ ఎన్ ఎం ఆర్ యువసేన నాయకుడు కాశబోయిన శేఖర్ ముదిరాజ్,వంటిమామిడి డాకూరి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు



మెదక్ జిల్లా టేక్మాల్ మండలం (శుభోదయం న్యూస్): కుసంగి గ్రామంలో టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ 395 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు ,మొగల్ సామ్రాజ్యాన్ని అంతమొందించి, హిందూ ఆలయాల పరిరక్షణకై విరోచితమైన పోరాటం చేసిన గొప్ప వ్యక్తి, మరాఠ యోధుడు శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ అన్నారు, మొదటగా స్థానిక హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం హనుమాన్ మందిరం నుండి గ్రామ ప్రధాన మార్గం గుండా శివాజీ చౌక్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ,యూత్ సభ్యులు మాట్లాడుతూ పౌరుషానికి ప్రతీక అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ భవాని మాత భక్తిడిగా,స్త్రీలను గౌరవించడం ప్రతి ఒక్కరికి బాధ్యత అని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు కుల మతాలకు అతీతంగా అన్నదమ్ములవలె కలిసిమెలిసి ఉండి గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు రామగళ్ల అంజయ్య గ్రామ పెద్దలు పత్తిగారి నారాయణ గౌడ్, డాకూరి లక్ష్మయ్య,తలారి అడివయ్య,కుంట రాములు,పెరట్ల లడ్డు,పెద్దాపురం యాదయ్య,పెద్దాపురం బాలయ్య, గ్రామ కాంగ్రెస్ అద్యక్షులు సుబ్బారావు, చైతన్య యూత్ కార్యవర్గ సభ్యులు సభ్యులు వెంకట్ గౌడ్, అనిల్ గౌడ్,వెంకట్ గౌడ్, శంకర్,ఆంజనేయులు,పిట్ల పాండు,కిరణ్ రెడ్డి,శివ,యాద గౌడ్ అభిలాశ్ గౌడ్,పిట్ల సాయి,నరేష్,లక్ష్మణ్ గౌడ్,తలారి నాగరాజు, అజయ్,కృష్ణ,రాజు,సతీష్,అరుణ్,కిరణ్,ప్రేమ్, సాయి గణేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం : నీలం మధు ముదిరాజ్



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): గజ్వేల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక మరియు పట్టభద్రుల ఆత్మీయ సమావేశంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏడాదిలోనే 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు.ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం గజ్వేల్ పట్టణంలోనీ పిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గారికి మద్దతుగా సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, ఇంచార్జ్ తుంకుంట నర్సారెడ్డి గారి అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల, పట్టభద్రుల సన్నాహక సమావేశం నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి నీలం మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులను తీవ్రంగా వంచించిందని ఆరోపించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన జీవన్ రెడ్డి నిరుద్యోగుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న మోసాలపై పోరాటం చేశారన్నారు. నిరుద్యోగుల మద్దతు తో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అనుగుణంగా ఒక్క ఏడాదిలోనే 56 వేలకు పైగా కొలువులు ఇచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిందని తెలిపారు.పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందన్నారు. ఒక వైపు వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్ లు ఇస్తూనే మరొక పక్క రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకుని వస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్న విషయాన్ని గమనించాలని కోరారు.గత నెలలో దావోస్ వేదికగా జరిగిన సదస్సులో రూ.1.64 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చిన విషయాన్ని ఆయన ఉదహరించారు.యువత కు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు అత్యుత్తమ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ లను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్టభద్రులు నిరుద్యోగులు మద్దతు కాంగ్రెస్ పార్టీకే లభించిందని ప్రస్తుతం



జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ను పట్టభద్రులంతా కచ్చితంగా కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని దీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నిరుద్యోగుల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు మద్దతునిచ్చి పట్టబద్రులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి , డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఆంక్ష రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, పట్టభద్రులు,మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సాధకుడు 'రామకృష్ణ పరమహంస'





రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): సత్యాన్ని అన్వేషించడం ఎలాగో తన జీవితం ద్వారా, దేవుని రహస్యాన్ని సాధారణ మనిషి భాషలో వెల్లడించి మతాలన్నీ మోక్షానికి వేర్వేరు మార్గాలని , అన్ని మతాలు ఒకే భగవంతుని వైపు దారితీస్తాయని సనాతన ధర్మం ప్రాముఖ్యతను, భారతీయ తత్వచింతన లోని ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఆధ్యాత్మిక సాధకుడు రామకృష్ణ పరమహంస అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలో స్థానిక శ్రీ రామకృష్ణ సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి రామకృష్ణ పరమహంస 190 వ జయంతి వేడుకల్లో పాల్గొన్న పలువురు వక్తలు రామకృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఆధ్యాత్మికవేత్తగా, స్వామి వివేకానందకు గురువుగా, ఎందరికో జ్ఞాన మార్గదర్శిగా రామకృష్ణ పరమహంస ప్రసిద్ధులున్నారు. అర్ధాంగి శారదాదేవిని జగన్మాతగా ఆరాధించి, ఆధ్యాత్మిక గురువుగా తీర్చిదిద్ది సరికొత్త సంప్రదాయానికి రామకృష్ణ పరమహంస శ్రీకారం చుట్టారన్నారు. స్వామి వివేకానంద హైందవ ఝంఝూమారుతంగా సంచలనం సృష్టించడానికి శక్తి సంపత్తులను ప్రసరింపజేసిన మూలవిరాట్టుయైన స్వామి రామకృష్ణ ఆధునిక సమాజంలో సనాతన ధర్మం నిలబెట్టిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ గురుకులం పాఠశాల విద్యార్థుల కోలాట ప్రదర్శన నడుమ స్వామి రామకృష్ణ పరమహంస చిత్రపటంతో పురవీధులలో గొప్ప ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం రామకృష్ణ సేవా మందిరంలో భజన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో రామకృష్ణ సేవా మండలి సభ్యులు గుంటక కాశిరెడ్డి, పల్సూరి రాముడు, నాళం పెదబాబు, గుండా రామ్మూర్తి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాడికి హైస్కూల్ లో విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలపంపిణీ



యాడికి ఫిబ్రవరి 19 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) పట్టణం లోని గుత్తి రోడ్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధుసూదనరాజు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులలో 26 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందచేశారు.కార్యక్రమం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అవిసె నాగన్న , ఉపాధ్యాయులుబండి రామాంజనేయులు,అచ్యుత బాలయ్య శెట్టి,పశుపుల రవికుమార్ ,గుద్దేటి విశ్వ నాథ్ ,చంద్రశేఖర్, పోలా జ్యోతిలక్ష్మి,యం ఓబులమ్మ, తదితర ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కార్యక్రమం లో పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ వారి పొలం పిలుస్తుంది కార్యక్రమం




దోర్నాల మండల రిపోర్టర్– ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోని బోడె నాయక్ తండా గ్రామంలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం మరియు రైతు విశిష్ఠ గుర్తింపు సంఖ్య అవగాహనా నమోదు కార్యక్రమం నిర్వహించడం.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ పథకాలు రావాలంటే తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య ఉండాలని కాబట్టి రైతులందరు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో మీ యొక్క పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ నెంబర్, చరవాణి నెంబర్ తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద ఈ నెల 25 వ తేది లోపు నమోదు చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బోడే నాయక్ తండా గ్రామ రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## టైలర్స్ డే కార్యక్రమానికి ఎరిక్షన్ బాబుని ఆహ్వానించిన అసోసియేషన్ సభ్యులు



ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ – నారాయణ (శుభోదయం న్యూస్): ఫిబ్రవరి 28 టైలర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేయనున్న టైలర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొనాలని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుని ఆహ్వానించిన పట్టణ టైలర్స్ అసోసియేషన్ సభ్యులు.. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), కార్యవర్గ కార్యదర్శి పోకూరి సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షులు గుంటూరు వెంకటాచారి, సెక్రటరీ షేక్ ఇస్మాయిల్, మాజీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, లక్ష్మయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డ్రై డే కార్యక్రమం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



దోర్నాల మండల రిపోర్టర్– ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల సబ్ యూనిట్ పరిధి లోని చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దోర్నాల -1 సచివాలయం నందు డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సి హెచ్. రమేష్ బాబు, సూపర్వైజర్ కందుల ఇశ్రాయేలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తద్వారా వచ్చు వ్యాధులను అరికట్ట వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఆశా కార్య కర్త ప్రావీణ్యం పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుపడే బొందిమడుగుల గ్రామ సర్పంచ్ యండ చౌడప్ప...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో 2021 ఫిబ్రవరి నెలలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం గ్రామ ప్రజలకిచ్చిన హామీలను పలు అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన గ్రామ సర్పంచ్ యండ చౌడప్ప యాదవ్, గ్రామ సర్పంచ్ సలహా దారులు సలీంద్ర ప్రతాప్ యాదవ్ గ్రామ సర్పంచ్ గా గెలిచి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా గ్రామ పంచాయతీ ప్రజలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్బంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ యండ చౌడప్ప, సర్పంచ్ సలహా దారులు సలీంద్ర ప్రతాప్ యాదవ్ లు సంయుక్తంగా మాట్లాడుతూ గ్రామంలో వాటర్ ట్యాంక్స్ 9 సిస్టమ్స్ ప్రజల తాగునీరు అవసరాల కోసం చేపట్టడం జరిగిందని, గ్రామంలో పారిశుధ్యం పనులు, గ్రామంలో విద్యుత్ స్తంభాలు దాదాపు బొంది మడుగుల గ్రామం మజార గ్రామమైన లింగనేని దొడ్డి గ్రామాల్లో 50 విద్యుత్తు స్తంభాలు కొత్తగా అమలు చేయడం జరిగిందని,లింగ నేని దొడ్డి గ్రామానికి తాగునీరు అవసర కోసం కొత్త పైప్లైన్ దాదాపు ఒకటిన్నర కిలోమీటర్లు తీసుకెళ్లడం జరిగిందని,గ్రామంలోని స్మశాన వాటికలో మరమత్తులు చేయడం జరిగిందని, పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాం కుమార్ చొరవతో తొమ్మిది లక్షల సిసి రోడ్డు పనులు చేయడం జరిగిందని,నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామ ప్రజలకిచ్చిన మాటను గ్రామ సర్పంచ్ నిలబెట్టుకోవడమే కాకుండా,రాబోయే రోజుల్లో పత్తికొండ ఎమ్మెల్యే కేయి శ్యామ్ కుమార్ సహకారంతో గత ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న మారెళ్ల బొంది మడుగుల వెళ్లే రహదారిలో కుంగిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి శాశ్వత పరిస్కారం చేయిస్తామని,బొంది మడుగుల గ్రామ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని,గ్రామ అభివృద్ధికొరకు సహకరించిన గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ యండ చౌడప్ప, సర్పంచ్ సలహాదారులు సలీంద్ర ప్రతాప్ యాదవ్,గ్రామ ఉప సర్పంచ్ కౌలుట్లమ్మ,వార్డు మెంబర్లు రంగస్వామి,గంధం లక్ష్మి, బాలరాజ్, మహాలక్ష్మి, షరీఫా,బెస్తా లక్ష్మీదేవి,హుస్సేన్ బీ,వీరేంద్ర గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించిన యాడికి సీఐ




యాడికి ఫిబ్రవరి 19 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ )మండలంలోని బోయరెడ్డి పల్లె వద్ద ఉన్న ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీలో బుధవారం సైబర్ నేరాల పట్ల కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని యాడికి సిఐ ఎం. ఈరన్న తెలియజేశారు. అనంతపురం ఎస్పీ జగదీష్ మాట్లాడిన వీడియో ప్రచార రథంలో ప్లే చేసి కార్మికులకు చూపించడం జరిగింది. సాయంత్రం యాడికి పాత పోలీస్ స్టేషన్ సర్కిల్లో కూడా ప్రచార రథంలో వీడియోలు ప్లే చేసి అక్కడున్న ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాడికి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగింది..

## మా జీతా భత్యాలు చెల్లిస్తేనే రేపటిని నుండి మా విధులు నిర్వహిస్తాం




యాడికి ఫిబ్రవరి 19 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) మండల మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది అయిన స్వీపర్లు, వాటర్ మెన్లు, బిల్లు కలెక్టర్లు, ఎలక్ట్రిషన్స్ అందరు కలిసి తాడిపత్రి శాసనసభ్యులు అయినా జే సి అస్మిత్ రెడ్డి నివాసం చేరుకొని వారి గోడు విన్నవించుకున్నారు. కాంట్రాక్టు సిబ్బంది అయినా మాకు గత నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించక ఇళ్లలో కూటికి కూడా గడవని పరిస్థితి ఏర్పడింది అని వాపోయారు.ఎమ్మెల్యే అనుచరులు అయినా ఒకరు పరిస్థితులు బాలేనప్పుడు ఏదో ఒక ఒంక లేదా తోట్లలో నీరు తాగి కూడా పని చేయాలని చెప్పడంతో అక్కడికి వెల్లిని కాంట్రాక్టు సిబ్బంది అంత అక్కడ ఎవరిని ఏమని గోడు




పెట్టుకొన్న మన బాధ తీరదని వెనుతిరిగారు. అదేకాకుండా ఇంటి వరకు వెళ్లిన తమని కనీసం ఎమ్మెల్యే మీ సమస్య ఏమిటి అని తెలుసుకోలేదు అని అక్కడికి వెళ్ళిన కాంట్రాక్టు సిబ్బంది తమ బాధను తెలియజేశారు. వెంటనే యాడికి గ్రామం చేరుకొని మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విస్తారణా అధికారి మరియు మండల ప్రజా పరిషత్ ఆదికారి కి వారి జీతా భత్యాలు చెల్లించాలని, మా బాధ తీర్చాలని కోరగా రెండు మూడు రోజులలో మీ సమస్య పరిష్కారం చేస్తాం అని హామీ ఇవ్వడం తో అక్కడికి వచ్చిన సిబ్బంది ఎంపీడీఓ మాట మీద గౌరవం తో సరే అని చెప్పారు. ఎంపీడీఓ మాట మేరకు మూడు రోజుల వరకు వేచి చూస్తం అని ఆ తర్వాత పంచాయితీ కార్యాలయం ముందర ధర్నా చేస్తాం అని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాడికి మేజర్ గ్రామ పంచాయితీ కాంట్రాక్టు సిబ్బంది స్వీపర్లు, వాటర్ మెన్లు, బిల్లు కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్ లు తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీశ్రీశ్రీ ఓబులేశ్వర స్వామి సంప్రోక్షణ మరియు ప్రాణప్రతిష్ట కార్యక్రమం



యాడికి ఫిబ్రవరి 19 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ )మండలంలోని కమలపాడు గ్రామంలో బుధవారం శ్రీశ్రీశ్రీ ఓబులేశ్వర స్వామి సంప్రోక్షణ మరియు ప్రాణప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మహాగణపతి పూజ, గోపూజ, పుణ్యాహ వచనం, సప్తమాతృక పూజ, కలశ స్థాపనం, రక్షాబంధనం, నవగ్రహ జప ఆరాధనం, స్వామివారి విగ్రహాల జలదివాస పూజ, మహా స్వప్నం చేయుట, శయ్యాధివాసం, పుష్పాదివాసం, యంత్ర ప్రతిష్ట , విగ్రహ ప్రతిష్ట , కలశ ప్రతిష్ట, మహా గణపతి హోమం, శ్రీ లక్ష్మీనరసింహ శ్రీ మహా విష్ణు సుదర్శన సర్వప్రామాచిత్తి హోమములు, ప్రతిష్ట అనంతరం మహా నైవేద్య మహా మంగళహారతి పూజా కార్యక్రమంలో నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమములు యాడికి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ప్రధాన అర్చకులు ఆలూరు హరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమలపాడు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు చింతలాయపల్లె గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు స్వామివారి భక్తమండలి పాల్గొనడం జరిగింది..

## చెలికాని సీతయమ్మ మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపుల అద్దెలు తగ్గించాలి



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాసరావు. (శుభోదయం న్యూస్): బొబ్బిలి పురపాలక సంఘానికి చెందిన చలికాని సీతయ్యమ్మ కూరగాయలు మార్కెట్ షాపుల అద్దెలు (ధర) తగ్గించాలని కూరగాయల షాపుల యాజమాన్లు పురపాలక అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక చలికాని సీతమ్మ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉన్నప్పుడు సీతయ్యమ్మ కూరగాయల మార్కెట్ షాపు అద్దె( 950/–)రూపాయలు మాత్రమే ఉండేదని, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత షాపు అద్దెను (2,750/–) రూపాయలకు పెంచారని తెలిపారు. ప్రస్తుతం షాపు అద్దె (3000/–)మూడు వేల రూపాయలకు పెంచుతూ ఓటమి ప్రభుత్వం ఆదేశించడంతో పురపాలక అధికారులు అద్దెలు చెల్లించాలని డబ్బులు కట్టాలని గత కరోనా టైంలో షాపుల



అద్దెలు చెల్లించాలని పురపాలక అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కరోనా సమయంలో వ్యాపారాలు మానేసి షాపులు మూసివేసామని, అలాంటి సమయంలో అద్దెలు చెల్లించుకోవాలని పరిస్థితుల్లో ఉన్న మునిసిపల్ అధికారులు మాత్రం మమ్మల్ని అద్దెలు కట్టమని నిరంతరం వేధిస్తున్నారు వారు వాపోయారు.ఈ కూటమి ప్రభుత్వం తక్షణమే చెలికాని సీతయ్యమ్మ కూరగాయల మార్కెట్ షాపుల వ్యాపారస్తులపై కరుణించి పెంచిన అద్దె ధరలను తగ్గించాలని వారు కోరారు. అలాగే బొబ్బిలి పట్టణంలో విచ్చలవిడిగా కూరగాయల అమ్మకాలు చేస్తున్న చర్చి సెంటర్, సిబిఎం గర్ల్స్ హై స్కూల్, రాజా కళాశాల వద్ద ఉన్న కూరగాయలు అమ్మకాలు దారులను పూర్తిగా నిర్మూలన చేసి మార్కెట్లో అమ్మే విధంగా పురపాలక అధికారులు చర్యలు తీసుకుంటే మా యొక్క వ్యాపారాలు సక్రమంగా జరుగుతాయని, వ్యాపారస్తులు విలేకరులకు,మీడియాకు తెలియజేశారు. తక్షణమే అధికారులు స్పందించి బొబ్బిలి పట్టణంలో ఉన్న చర్చి సెంటర్, సిబిఎం గర్ల్స్ హైస్కూల్ వద్ద కూరగాయల మార్కెట్ను, రాజా కళాశాల వద్ద ఉన్న కూరగాయలు మార్కెట్ను ఎత్తివేసి సీతయ్యమ్మ కూరగాయల మార్కెట్ వద్ద అమ్మకాలు జరిపితే పురపాలక సంఘ అభివృద్ధికి, షాపుల అద్దెలకు, ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే ప్రజలు అందరూ చెలికాని సీతయ్య అమ్మ కూరగాయల మార్కెట్ వచ్చి కూరగాయలు కొనుక్కొని అవకాశముంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు ( బేబీ నాయన) స్పందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోను, నారా లోకేష్ బాబు తోనూ, పవన్ కళ్యాణ్ తోను చర్చించి, బొబ్బిలి పట్టణంలో ఉన్న చెలికాని సీతయ్యమ్మ కూరగాయల మార్కెట్ షాపుల అద్దెల ధరను తగ్గించాలని వారు వినయ పూర్వకంగా కోరుతున్నారు.

## ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు:-బాబావలి



లేపాక్షి,మండలం రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) మండల పరిధిలో ని ప్రభుత్వ హాస్టల్ను సందర్శించడం ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతమైన భోజనాన్ని అందించాలని విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని పెండింగ్ లేకుండా మెస్ కాస్మోటిక్స్ చార్జీలను విడుదల చేయాలని కోరారు హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయకపోతే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తాము తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి ఎస్ఎఫ్ఐ లేపాక్షి మండల కార్యదర్శి నందీష్ ఎస్ఎఫ్ఐ నాయకులు అశ్వత్ నారాయణ పాల్గొన్నారు.

## రజక విద్యా సేవా సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్టాల అధ్యక్షులు దేవలూటి శంకర్ శుక్రవారం, శనివారం పశ్చిమగోదావరి జిల్లా పర్యటన....



శుభోదయం న్యూస్ : రజక విద్యా సేవా సంక్షేమ సంఘంఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్టాల అధ్యక్షులు దేవలూటి శంకర్ తన జిల్లాల పర్యటన లో భాగంగా శుక్రవారం,శనివారం పశ్చిమగోదావరి జిల్లాలో రెండు రోజుల పాటు అందుబాటులో ఉండనున్నట్లు అయన ఒక ప్రకటన లో తెలిపారు..పేద రజక విద్యార్థులు, తల్లిదండ్రులు లేని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ,శ్రేయోభిలాషులు, వివిధ రజక సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మిత్రులు,నన్ను కలవాలనుకునే వారు ఈ కింది నెంబర్స్ ను సంప్రదించవచ్చు అని ఆయన ఒక ప్రకటన లో తెలిపారు. అయన తో ప్రత్యక్షంగా మాట్లాడాలనుకునే వారు కింది మొబైల్ నెంబర్స్ : 8096646072/ 6304330529 కి సంప్రదించవచ్చు ఆయన తెలిపారు.

## పరిమితికి మించి టికెట్లను ఎందుకు అమ్మారు



న్యూఢిల్లీ : పరిమితికి మించి టికెట్లను ఎందుకు అమ్మారు ? అని కేంద్రం, భారత రైల్వే ను ఢిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి కేంద్రం, భారత రైల్వేపై బుధవారం ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పరిమితికి మించి టికెట్లను ఎందుకు అమ్మారు ? అని ప్రశ్నించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు నివారించేందుకు భద్రత చర్యలు, రైలు బోగీల్లో ప్రయాణికుల సంఖ్యను పరిమితం చేసే నిబంధనల అమలు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. కుంభమేళాకు ప్రయాణికులు పోటెత్తడంతో గతవారం న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం విదితమే. 14వ నంబరు ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉండడంతో యాత్రికులు అక్కడకు చేరుకున్నారు. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు అదే సమయంలో 12, 13, 14 నంబరు ప్లాట్‌ఫాంలపై ఉన్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రద్దీ పెరిగిపోయి తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో 18 మంది మరణించగా, చాలామంది గాయపడ్డారు.

## విద్యను నిర్లక్ష్యం చేస్తున్న యోగి ఆదిత్యనాథ్



లక్నో : ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విమర్శించారు. యుపి అసెంబ్లీలో అవధి, బ్రజ్, భోజ్‌పురి, బుందేలి, ఆంగ్లభాషలు అనువాదంలో అందుబాటులో ఉన్నాయి. ఈ భాషలకు తోడు ఉర్దూని కూడా అనువాద భాషలో చేర్చాలని ఎస్‌పి పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌పై ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో మండిపడ్డారు. ఎస్‌పి డిమాండ్‌ను ఖండిస్తున్నట్లు యోగి చెప్పారు. మౌల్వీలను తయారుచేయడానికే ఎస్‌పి పార్టీ ఉర్దూని ప్రోత్సహిస్తుందని ఆయన విమర్శించారు. యుపి సిఎం వ్యాఖ్యలపై ఎస్‌పి చీఫ్ అఖిలేష్ యాదవ్ ఫైర్ అయ్యారు. విద్యను, రాష్ట్ర ప్రగతిని యోగి ఆదిత్యనాథ్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'భాష పట్ల కానీ.. రాష్ట్ర ప్రగతి పట్ల కానీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తనకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు దేశవ్యాప్తంగా 11 లక్షల ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. వాటిల్లో ఎక్కువశాతం యుపిలోనే మూతబడ్డాయి. మూతబడిన పాఠశాలల్లో ఎన్ని ఇంటర్మీడియట్ పాఠశాల్ని తెరిచారు? వీటిల్లో పాలిటెక్నిక్ అయినా, ఐటిఐ, ఇంజనీరింగ్ అయినా ప్రభుత్వం ఎన్నింటి పట్ల శ్రద్ధతీసుకుంటుంది? విద్య నాణ్యతలను ఎలా మెరుగుపరిచారు? వంటి విషయాలకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు అందుబాటులో ఉన్నాయి' అని ఆయన అన్నారు. కాగా, యుపి సిఎం కావాలనే హిందూ- ముస్లిం సబ్జెక్ట్‌గా మార్చారని ఎస్‌పి నేత మాతా ప్రసాద్ పాండే ఆరోపించారు. 'మేం విధాన సభలో ఆంగ్ల భాష ప్రవేశాన్ని వ్యతిరేకిస్తున్నాము. ఇతర భాషల మాదిరిగానే ఉర్దూని కూడా అనువాద భాషలలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నాయి. ఉర్దూ కూడా ఇతర భాషల మాదిరిగానే మరో భాష అంతే. అసెంబ్లీలో హిందూ- ముస్లిం అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే సిఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించినట్లు స్పష్టంగా తెలుస్తుంది' అని మాతా ప్రసాద్ పాండే అన్నారు.

## ఈశాన్య భారతంలోని 13 రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



బంగాళాఖాతంలో ఏ?ర్పడిన తుఫాను కారణంగా ఈశాన్య భారతంలోని 13 రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఐఎండి (భారత వాతావరణశాఖ) తెలిపిన వివరాల ప్రకారం ఫిబ్రవరి 19న నాగాలాండ్ అస్సాం, మేఘాలయ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఫిబ్రవరి 21న ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, హిమాలయ,పశ్చిమబెంగాల్, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాలలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఫిబ్రవరి 23, 24 తేదీల్లో బీహార్‌లోని 16 జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం, గురువారం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఫిబ్రవరి 19, 20 తేదీలలో రాజస్థాన్, పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది.

## ఏ ఒక్క రైతూ సంతోషంగా లేడు : వైఎస్.జగన్




గుంటూరు : 'కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క రైతూ సంతోషంగా లేడు ' అని వైసిపి అధినేత జగన్ విమర్శించారు. బుధవారం గుంటూరులోని మిర్చి యార్డు రైతులను జగన్ కలిశారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్ మీడియాతో మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు చాలా కష్టాలు పడుతున్నారని అన్నారు. ఏ ఒక్క రైతూ సంతోషంగా లేదని చెప్పారు. ఏ పంటకూ గిట్టుబాటు లేకుండా పోయిందని, దీంతో రైతులు బతికే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. తమ హయాంలో.. రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కల్పించామని జగన్ అన్నారు. రూ.21 వేల నుంచి రూ. 27 వేల వరకు వచ్చేదని చెప్పారు. పెట్టుబడి సాయం చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. వైసిపి హయాంలో రైతే రాజు కానీ, కూటమి ప్రభుత్వం రైతును దగా చేసిందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వలేదనీ, రైతులకు సున్నా వడ్డీ రాని పరిస్థితి నెలకొందని అన్నారు. మిర్చి రైతుల అవస్థలను చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోవడం లేదని జగన్ ధ్వజమెత్తారు. రైతులు పండించిన పంటను కూడా అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మిర్చి పంటకు కనీసం రూ.11 వేలు కూడా గిట్టుబాటు ధర లేదని, ఆర్బీకే వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ ఏడాది దిగుబడి కూడా బాగా తగ్గిపోయిందన్నారు. రైతులను దళారీలకు అమ్మేసే పరిస్థితి కనిపిస్తోందని, ఎరువులను బ్లాక్‌లో కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరవాలని జగన్ అన్నారు. రాబోయే రోజుల్లో రైతులకు అండగా వైసిపి ఉద్యమిస్తుందని వైఎస్ జగన్ తెలిపారు.

# సిరుల చీపురు

### గిరిజనులకు వరంలా మారిన కొండ చీపుర్ల సాగు
### ఏజెన్సీలో సుమారు 1,000 ఎకరాల్లో పంట
### ఎకరానికి 2 వేల చీపురు కట్టల వరకు తయారీ
### ఏటా రూ. లక్ష వరకు ఆదాయం



పాడేరు: మనం ఇళ్లలో వాడే చీపురు పంట గిరిబిడ్డలకు జీవనాధారం. ఏజెన్సీలోని హుకుంపేట, డుంబ్రిగుడ, పెదబయలు, మంచంగిపుట్టు, అరకులోయ, జి.మాడుగుల, పాడేరు, సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో వేల కుటుంబాలు చీపురు పంటను సాగుచేస్తూ ఉపాధి పొందుతున్నాయి. పూర్వం దట్టమైన అడవుల్లో మాత్రమే కనిపించే కొండచీపురు మొక్కలు నేడు మన్యం అంతా విస్తరించాయి. కొండపోడు, మెట్ట భూముల్లో గిరిజనులు చీపురు పంటను సాగుచేస్తున్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో ఈ పంట చేతికి వస్తుంది. చీపురు గడ్డి శాస్త్రీయనామం "థైసెలోలెనా మాక్సిమా' ఈ మొక్కలు హిమాలయాల్లోని ఎత్తయిన ప్రాంతాలు, దేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తాయి. మన ప్రాంతానికి దీన్ని వలస మొక్కగా చెప్పవచ్చు.

### చీపురుతో స్వయం సమృద్ధి

కొండచీపుర్లకు దేశవ్యాప్తంగా ఆదరణ ఉంది. ప్రస్తుతం చీపురు పంట దిగుబడికి రావడంతో పుల్లలను సేకరిస్తున్న గిరిజనులు వాటిని బాగా ఎండబెట్టి, కట్టలు కట్టి మండల కేంద్రాలు, వారపుసంతల్లో అమ్ముతున్నారు. చీపురు కట్టల తయారీలో గిరిజన కుటుంబాలు ఇంటిల్లిపాదీ కష్టపడతాయి. మహిళలు కూడా చీపురు సేకరణ, కట్టలు కట్టడం అలవాటు చేసుకున్నారు.చీపురు కట్టకు మార్కెట్‌లో రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోంది. ఎకరానికి కనీసం 2వేల వరకు చీపురు కట్టలు తయారవుతాయి. దీంతో ప్రతి గిరిజన రైతు ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదిస్తున్నాడు. కొంతమంది గిరిజన రైతులు నేరుగా విశాఖపట్నం,గాజువాక, విజయనగరం, రాజమండ్రి వంటి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏటా ఏజెన్సీ అంతటా కొండచీపుర్ల అమ్మకాలు భారీగా జరుగుతాయి. ప్రస్తుతం మన్యం సంతల్లో వ్యాపారులంతా పోటాపోటీగా కొనుగోలు చేస్తుండటంతో చీపురు అమ్మకాల ద్వారా గిరిజన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. అడవిలోకి వెళ్లి పుల్ల, పుల్ల ఏరుకుని ఇంటికి తెచ్చి చీపురు కట్టలుకట్టి సంతల్లో అమ్ముకునేవారు. దట్టమైన అడవుల్లో చీపురు పుల్లల సేకరణ గిరిబిడ్డలకు నిరంతర సవాలే. నిత్యం క్రూర మృగాలు, విషసర్పాలతో పోరాటమే. సేకరణ మరీ కష్టంగా మారుతుండటం, రోజురోజుకూ గిరాకీ పెరుగుతుండటంతో ఆ చీపురు మొక్కల్ని తమ సమీపంలోని కొండవాలుల్లో పెంచడం మొదలు పెట్టారు. అలా ప్రారంభమైన చీపుర్ల సాగు ప్రస్తుతం ఏజెన్సీలో సుమారు వెయ్యి ఎకరాల వరకు విస్తరించింది.

### చీపురు పంటతో మంచి ఆదాయం

కొండచీపురు పంట ద్వారా మా గ్రామంలోని అన్ని గిరిజన కుటుంబాలకు మంచి ఆదాయం లభిస్తోంది. మెట్ట,కొండపోడులో చీపురు సాగు చేస్తున్నాం.ఎకరం పంట ద్వారా సుమారు 2వేల వరకు చీపురు కట్టలు తయారు చేస్తాం. పంట సేకరణ, కట్టలు కట్టడం కష్టం తప్ప చీపురు సాగుకు ఎలాంటి పెట్టుబడి లేదు.

### మహిళలకు స్వయం ఉపాధి

చీపురుపంట సాగుతో సీజన్‌లో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తోంది. సంక్రాంతి పండుగ దాటిన నాటి నుంచి మే నెల వరకు చీపురు కట్టలను సంతల్లో అమ్మకాలు జరుపుతాం, వీటి అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో సగం మహిళలమే తీసుకుని ఆసొమ్ముతో పలు వస్తువులు కొనుక్కుంటాం.గత పదేళ్ల నుంచి కొండచీపురు పంటను సాగుచేసుకుంటున్నాం.చీపురు పంట ఆర్థికంగా ఏటా మా కుటుంబాలను ఆదుకుంటోంది.

# చారిత్రక దారి.. 300 ఏళ్ల మెట్లబావి

### మరమ్మతుల తర్వాత అందంగా మారిన మెట్లబావి లోపలి భాగం
### ఆ కాలంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం
### చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో వెలుగులోకి..
### తాగు, సాగు నీటికి వినియోగం..
### స్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాటు
### విశ్రాంతితోపాటు దుస్తులు మార్చుకునేందుకు బావి మధ్యలో ప్రత్యేక గదులు



నాటి చారిత్రక కట్టడాలు నేటి తరానికి గొప్ప సంపద. గతాన్ని చూడని ఇప్పటి జనానికి అలనాటి నిర్మాణాలే సజీవ సాక్ష్యాలు. దశాబ్దాల కాలం నాటి నిర్మాణాలు చెక్కుచెదరకుండా ఇప్పటికీ పటిష్టంగానే ఉండటం అప్పటి సాంకేతికతకు నిదర్శనం. యంత్రాలు, ఇతర నిర్మాణ పనిముట్ల గురించి తెలియని సమయంలో కేవలం మానవుల తెలివితో చేపట్టిన నిర్మాణాలు నేటి సాంకేతికత కంటే చాలా పటిష్టంగా ఉన్నా యి. అలాంటి వారసత్వ సంపద ఎక్కడ ఉన్నా గుర్తించి రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

### రాజధానికి 52 కి.మీ. దూరంలో..

హైదరాబాద్‌కు సరిగ్గా 52 కి.మీ. దూరంలో 65వ నెంబరు జాతీయ రహదారిపై విజయవాడ మార్గంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామం ఉంది. ఈ గ్రామంలో జాతీయ రహదారి వెంట ప్రస్తుతం ఉన్న సాయిబాబా దేవాలయాన్ని గతంలో గోసాయిమఠంగా పిలిచేవారు. దశాబ్దాల కిందట ఈ మఠాన్ని అక్కడ ఏర్పాటు చేశారు. దేవాలయం వెనుక భాగాన దిగుడుబావి (మెట్లబావి) ఉంది. ఆ దిగుడు బావిని 300 ఏళ్ల కిందట అప్పటి రాజులు నిర్మించారు. ఎంతో గొప్ప సాంకేతికతతో నిర్మించిన ఈ బావి ఇప్పటికీ చెక్కు చెదరలేదు. దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉండటంతో కొంత మేరకు నిర్మాణాలు దెబ్బతిన్నాయే తప్పిస్తే మిగతా కట్టడాలన్నీ యథావిధిగా ఉన్నాయి.

### రాజుల కాలంలో దిగుడుబావి నిర్మాణం

దిగుడుబావి (మెట్లబావి) గొప్ప చరిత్ర కలిగి ఉంది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు ఇక్కడ విశ్రాంత మందిరాన్ని నిర్మించుకున్నారని, ఆ విశ్రాంత మందిరానికి అనుసంధానంగా అన్ని రకాల సౌకర్యాలతో ఈ దిగుడుబావిని నిర్మించి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. దిగుడుబావి పరిసరాల్లోని రాజు భూములు కాలక్రమేణా స్థానికులకు వచ్చాయి.

### పూర్తిగా రాళ్లతోనే..

ఈ దిగుడుబావిని పూర్తిగా రాళ్లతోనే నిర్మించారు. తూర్పున 6 అడుగుల వెడల్పు, దిగువకు 20 అడుగులు, ఉత్తరంలో 10 అడుగుల వెడల్పు ప్రకారం మొత్తంగా దిగువకు 60 అడుగుల మేర మెట్లు ఏర్పాటు చేశారు. మెట్ల మార్గాన్ని గ్రానైట్ రాళ్లతో అందంగా తీర్చిదిద్దారు. 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 80 అడుగుల లోతుతో ఈ బావిని నిర్మించారు. భూమి నుంచి 25 అడుగుల దిగువన బావిలో ప్రత్యేకంగా ఆర్చీలతో మూడు గదులు ఏర్పాటు చేశారు. బావిలో స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు ఈ గదులను నిర్మించారు. ఆ గదులు ప్రత్యేకంగా మహిళలు (నాటి రాణులు) వినియోగించేవిగా తెలుస్తోంది. పొలాలకు సాగునీరు, స్థానిక ప్రజానీకానికి తాగు నీరు అందించడంతో పాటు ప్రజలు స్నానాలు చేసేందుకు అనువుగా బావిని నిర్మించారు.

### గోసాయి మఠంగా ప్రత్యేక గుర్తింపు

చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి తూర్పున 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న లింగోజిగూడెం గ్రామం ఒకప్పుడు గోసాయిమఠంగానే గుర్తింపు పొందింది. కొన్నేళ్ల కిందట గోసాయిదొర అనే వ్యక్తి హైదరాబాద్%-%విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకొని ప్రస్తుతం సాయిబాబా దేవాలయం ప్రాంతంలో మఠాన్ని ఏర్పాటు చేశాడు. పలు ప్రాంతాలకు ప్రయాణాలు చేసే బాటసారులు అలసిపోయిన సందర్భాల్లో విశ్రాంతి తీసుకోవడంతోపాటు అక్కడే విడిది చేసేందుకు అనువుగా అందులో వసతులు ఉండేవని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో ఆర్టీసీ బస్సులు కూడా గోసాయిమఠం స్టేజీ అంటేనే ఆగేవంటే ఎంత ప్రాముఖ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆలయానికి ప్రస్తుతం రెండు ఎకరాలకుపైగా స్థలం అందుబాటులో ఉంది.

### మెట్లబావి పరిరక్షణకు ముందుకొచ్చిన హెచ్‌ఎండీఏ

శతాబ్దాల కాలంనాటి మెట్లబావి గురించి సాక్షి దినపత్రిక వెలుగులోకి తెచ్చింది. అందుకు సంబంధించి 2022, ఫిబ్రవరి 14న ప్రత్యేకమైన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనానికి అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ స్పందించారు. వెంటనే మెట్లబావి విషయాన్ని తెలుసుకుని మరమ్మతులు చేయాలని హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించారు. అందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అలా ఈ మెట్లబావిని సుందరీకరించారు. అనంతరం ఏప్రిల్ 14న దీన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ మెట్లబావి బాధ్యతలు హెచ్‌ఎండీఏ చూసుకుంటోంది. అయితే ఆ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక ప్రాంతంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

### కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్తాం

పురాతన మెట్లబావి అభివృద్ధి అంశాన్ని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తాం. పర్యాటక ప్రాంతంగా మారితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. పురాతన కట్టడాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మూడొందల ఏళ్ల కిందట నిర్మించిన మెట్లబావి మా గ్రామంలో ఉండటం మాకెంతో గర్వకారణం. ప్రభుత్వం, మున్సిపల్ శాఖ నిరంతరం పర్యవేక్షించాలి.

# ఆత్మావలోకనం అవసరం

విశ్వసనీయతను కాపాడుకునే విషయంలో, విలువలు పాటించే అంశంలో పట్టింపు ఉన్నట్టు కనబడకపోతే వ్యక్తులైనా, వ్యవస్థలైనా విమర్శలపాలు కాకతప్పదు. తన రిటైర్మెంట్‌కు ఒక రోజు ముందు సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల సంఘం(ఈసీ) చీఫ్ రాజీవ్ కుమార్ తమపై వస్తున్న విమర్శలకూ, ఆరోపణలకూ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఓడిన వారు ఫలితాలను జీర్ణించుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారన్నది ఆయన అభిప్రాయం. దీనికి మూలం ఎక్కడుందో, తామెంత వరకూ బాధ్యులో ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకునివుంటే సమస్య మొత్తం ఆయనకే అర్థమయ్యేది. ఈసీకి ఇప్పటికీ ఏదోమేర విశ్వసనీయత ఉందంటే అది మాజీ సీఈసీ టీఎన్ శేషన్ పెట్టిన భిక్ష. అంతకుముందు ఈసీ ఉనికి పెద్దగా తెలిసేది కాదు. అది రాజ్యాంగ సంస్థ అనీ, దానికి విస్తృతాధికారాలు ఉంటాయనీ ఎవరూ అనుకోలేదు. శేషన్ తీరు నియంతను పోలివుంటుందని, తానే సర్వంసహాధికారినన్నట్టు ప్రవర్తిస్తారని ఆరోపణలొచ్చిన మాట వాస్తవమే అయినా ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించటంలో, అవసరమైతే ఎన్నికలను రద్దు చేయటం వంటి కఠిన చర్యలకు వెనకాడకపోవటంలో ఆయనకెవరూ సాటిరారు. అనంతరం వచ్చిన సీఈసీల్లో అతి కొద్దిమంది మాత్రమే శేషన్ దరిదాపుల్లోకొచ్చే ప్రయత్నం చేశారు. గత కొన్నేళ్లుగా అసలు ఆ ఊసే లేకుండా కాలక్షేపం చేసినవారే అధికం. శేషన్ నెలకొల్పిన ప్రమాణాలను అందుకోకపోతే పోయారు... కనీసం ఆ సంస్థ ఔన్నత్యాన్ని దిగజార్చకపోతే బాగుండునని కోరు కోవటం కూడా అత్యాశేనన్న చందంగా పరిస్థితి మారింది. దాని స్వతంత్రత, తటస్థత, విశ్వస నీయత ప్రశ్నార్థకమయ్యే రోజులొచ్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించటానికి రాజ్యాంగం సృష్టించిన సంస్థ ఈసీ. అది తనకు ఎదురయ్యే అనుభవాలతో తన అధికారాలను పునర్నిర్వచించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తే, దానిద్వారా రాజ్యాంగం ఆశించిన ఉద్దేశాలు నెరవేరేవి. ఈసీ ఏక సభ్య సంఘంగా మొదలై త్రిసభ్య సంఘమైంది. కానీ ఉన్న అధికారాలనే సక్రమంగా వినియోగించుకోలేని అశక్తతకు లోబడుతుండటం చేదు వాస్తవం. రాజ్యాంగం ఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి ఇచ్చినా దాన్ని వినియోగించుకోవటంలో ఆసక్తి కనబరుస్తున్న దాఖలా లేదు. పార్టీలను నమోదు చేసుకునే అధికారం 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ఈసీకి ఇస్తోంది. ఆ నమోదును రద్దు చేసే లేదా ఆ పార్టీనే రద్దుచేసే అధికారం మాత్రం లేదు. మరింత స్వతంత్రంగా, మరింత దృఢ సంకల్పంతో వ్యవహరించమని వేర్వేరు తీర్పుల్లో సుప్రీంకోర్టు చేసిన సూచనలకు అనుగుణంగా ఈసీ వ్యవహరించివుంటే పరిస్థితి వేరేలా ఉండేదేమో! గెలిచిన పార్టీలకు ఆరోపణలు చేసే అవసరం తలెత్తదు. అంతటి త్యాగధనులు కూడా ఎవరూ లేరు. కానీ మాజీ సీఈసీ ఎస్‌వై ఖురేషీ చేసిన ఆరోపణల మాటేమిటి? వాటినీ కొట్టిపారేస్తారా? కనీసం ఆయన వ్యాఖ్యలపైన స్పందించలేని అచేతన స్థితికి ఈసీ చేరుకోవటాన్ని రాజీవ్ ఏరకంగా సమర్థించుకోగలరు? రోజులు గడిస్తే తప్పులు సమసిపోతాయా? ఇంత అమాయకత్వాన్ని నటిస్తున్న రాజీవ్ నిరుడు మేలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల తంతుపై వచ్చిన విమర్శలకు ఈ ఎనిమిది నెలల్లో ఒక్కసారైనా జవాబిచ్చారా? పోలింగ్ జరిగినరోజు రాత్రి 8 గంటలకు వోటింగ్ శాతాన్ని 68.12 అని ప్రకటించి, మరో మూడు గంటలు గడిచాక దాన్ని ఏకంగా 76.50 శాతమని చెప్పటం, మరో నాలుగు రోజులకు మళ్లీ గొంతు సవరించుకుని 80.66గా మార్చటంలోని మర్మమేమిటి? ఈ పెంపు ఏకంగా 12.5 శాతం. దాన్ని అంకెల్లోకి మారిస్తే 49 లక్షలు! ఈ మాయా జాలం ఏమిటో, కొత్తగా పుట్టుకొచ్చిన ఈ 49 లక్షలమంది కథాకమామీషు ఏమిటో చెప్పాల్సిన బాధ్యత ఆయనకు ఉండనవసరం లేదా? తమకై తాము ప్రజలను అయోమయంలోకి నెట్టి, తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసి రాజకీయపక్షాలపై బండరాళ్లు వేయటం ఏ రకమైన నీతి? మహారాష్ట్ర ఎన్నికలు సైతం ఈ బాణీలోనే సాగాయి. పోలింగ్ ముగిసిన సాయంత్రం 58.2 శాతం (6,30,85,732) మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పిన ఎన్నికల సంఘమే రాత్రికల్లా 65.02 శాతమని మార్చింది. కౌంటింగ్‌కు ముందు అది కాస్తా 66.05 శాతానికి పెరిగింది. అంటే వోటింగ్‌లో 7.83 శాతం పెరుగుదల. అంకెల్లో చూస్తే స్థూలంగా 76 లక్షలు. ఇలాంటి దుఃస్థితి అఘోరించినప్పుడు సందేహాలు రావా? ఆరోపణలు వెల్లువెత్తవా? రాజీవ్ మీడియా సమావేశం రోజునే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడిన కమిటీ కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్ కుమార్‌ను ఎంపిక చేసింది. ఇది సరికాదంటూ విపక్ష నేత రాహుల్‌గాంధీ అసమ్మతి నోట్ అందజేశారు. ఇలా వివాదాస్పద ఎంపికలోనే సమస్యకు బీజం ఉంటుందని, అటుపై ఈసీ నడతను నిశితంగా పరిశీలించటం మొదలవుతుందని రాజీవ్ గుర్తిస్తే మంచిది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఈసీ విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నదని ఖురేషీ విమర్శిస్తే ఇదే రాజీవ్ నొచ్చుకుని 'ఎంతమంది సీఈసీలు ప్రవర్తనా నియమావళికి సంబంధించిన ఫిర్యాదులు అందుకున్నారో, వాటి ఆధారంగా ఎందరిపై చర్య తీసుకున్నారో మేం ఆరా తీశాం' అని గంభీరంగా ప్రకటించారు. అదేమిటో బయటపెట్టాలని ఖురేషీ సవాలు చేస్తే ఈ ఆరేళ్లుగా మౌనమే సమాధానమైంది. ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించటం లేదని చెప్పటానికి ఇది చాలదా?

# స్పోర్ట్స్ టెక్నాలజీ మార్కెట్ ఏ రూ. 49,500 కోట్లు

## 2029 నాటికి 85 శాతం వృద్ధి

## ఎఫ్ఐఎఫ్ఎస్, డెలాయిట్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా స్పోర్ట్స్ టెక్నాలజీ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. వచ్చే నాలుగేళ్లలో 85 శాతం వృద్ధి చెందనుంది. 2029 నాటికి రూ. 49,500 కోట్లకు చేరనుంది. ఫ్యాంటసీ గేమ్స్ సంస్థ ఎఫ్ఐఎఫ్ఎస్, డెలాయిట్ విడుదల చేసిన సంయుక్త నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో భారతీయ స్పోర్ట్స్%-%టెక్ మార్కెట్ రూ. 26,700 కోట్ల స్థాయిలో ఉంది. యాప్‌లు, డివైజ్‌లు, సెన్సార్లు మొదలైనవి స్పోర్ట్స్ టెక్ కేటగిరీలోకి వస్తాయి. డిజిటల్ టెక్నాలజీల రాకతో క్రీడాకారులు పనితీరును మెరుగుపర్చుకునేందుకు అవసరమైన డేటాను అందించడంతో పాటు అభిమానులు కూడా క్రీడలను ఆస్వాదించేందుకు మరింత మెరుగైన అనుభూతిని అందించేందుకు వీలవుతోందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ప్రశాంత్ రావు తెలిపారు. దీంతో కొత్త వ్యాపార అవకాశాలు తెరపైకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామక్రమానికి ఫ్యాంటసీ స్పోర్ట్స్ సారథ్యం వహించగలదని ఆయన చెప్పారు. గణనీయంగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా సానుకూల ప్రభావాలు కూడా చూపిస్తోందని వివరించారు. 2029 ఆర్థిక సంవత్సరం వరకు పరిశ్రమ ఏటా 7 శాతం మేర వృద్ధి చెందుతుందని, 2027 ఆర్థిక సంవత్సరం నాటికి 17,500 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను కల్పిస్తుందని ప్రశాంత్ రావు తెలిపారు. ఇటు క్రీడాకారులు, అటు అభిమానులకు మరో స్థాయిలో స్పోర్ట్స్ అనుభూతిని టెక్నాలజీ అందించగలదని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) డైరెక్టర్ జనరల్ జాయ్ భట్టాచార్య తెలిపారు.

ఫ్యాంటసీ స్పోర్ట్స్‌పై జీఎస్‌టీ ఎఫెక్ట్..-ఫ్యాంటసీ స్పోర్ట్స్ విభాగంపై గ్యాంబ్లింగ్ ట్యాక్స్ రేట్ల స్థాయిలో 28 శాతం జీఎస్‌టీ విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో 2025 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం 10 శాతం మేర క్షీణించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. జీఎస్‌టీ దెబ్బతో ఫ్యాంటసీ స్పోర్ట్స్ కంపెనీల మార్జిన్లపై 50 శాతం మేర ప్రతికూల ప్రభావం పడుతోందని వివరించింది. జీఎస్‌టీ నిబంధనతో 2023లో ఈ విభాగంపై పెట్టుబడులు 90 శాతం పడిపోయాయని, 2024లో కొత్తగా పెట్టుబడులు రాలేదని నివేదిక పేర్కొంది. ని

# డిజిటల్ ఇన్‌ఫ్రాపై పెట్టుబడులు పెట్టాలి

## నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి

## రిమోట్ వర్కింగ్‌పై నిపుణుల అభిప్రాయాలు



న్యూఢిల్లీ: ఐటీ రంగంలో రిమోట్ పని విధానంతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై మరింతగా ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే, అంతర్జాతీయ ప్రాజెక్టులను కూడా అందిపుచ్చుకునేలా ప్రొఫెషనల్స్ నైపుణ్యాలను మెరుగుపర్చడంపైనా, తగిన వేదికలను ఏర్పాటు చేయడంపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దేశ, విదేశ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు జాతీయ స్థాయిలో అయిదు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. రిమోట్ ఐటీ వర్క్‌తో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని నిపుణులకు అవకాశాలు లభించడంతో ఆదాయ ఆర్జన సామర్థ్యాలు మెరుగుపడి, సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని టెక్ మహీంద్రా సీవోవో అతుల్ సొనేజా తెలిపారు.

### సామర్థ్యాల వెలికితీతకు అవకాశం..

చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతుల సామర్థ్యాలను వెలికి తీసేందుకు డిజిటల్ ఇన్‌ఫ్రా, విశ్వసించతగిన ఇంటర్నెట్ కనెక్టివిటీ, కొత్త నైపుణ్యాల్లో శిక్షణా కార్యక్రమాలు అవసరమని జ్ఞానిడాట్‌ఏఐ సీఈవో గణేష్ గోపాలన్ చెప్పారు. సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, పరిశ్రమలో భాగస్వామ్యాలను పెంపొందించడం మొదలైనవి చిన్న పట్టణాల్లోని ప్రొఫెషనల్స్ అంతర్జాతీయంగా పోటీపడేందుకు ఉపయోగపడగలవని వివరించారు.

# ‘గ్రోక్ 3’ను ఆవిష్కరించిన మస్క్




ఎక్స్‌ఏఐ కొత్త వర్షన్ ‘గ్రోక్ 3’ని ప్రారంభిస్తున్నట్లు కంపెనీ సీఈఓ ఎలాన్‌మస్క్ ప్రకటించారు. ఎక్స్‌లో ఇంజినీర్ల సమక్షంలో ఏర్పాటు చేసిన లైవ్ స్ట్రీమ్ ప్రజెంటేషన్‌లో ఈ కొత్త జనరేటివ్ ఏఐ మోడల్‌ను మస్క్ ఆవిష్కరించారు. గ్రోక్ 3 ఇప్పటివరకు ఉన్న గ్రోక్ 2 కంటే 10 రెట్లు ఎక్కువ సామర్థ్యంతో పని చేస్తుందని మస్క్ పేర్కొన్నారు. గణితం, సైన్స్, కోడింగ్ వంటి వివిధ విభాగాల్లో మార్కెట్‌లో పోటీదారులుగా ఉన్న ఆల్ఫాబెట్ ఇంక్‌కు చెందిన గూగుల్ జెమిని, డీప్ సీక్- వీ 3 మోడల్, ఆంత్రోపిక్-క్లాడ్, ఓపెన్‌ఏఐ-జీపీటీ-4ఓ కంటే సమర్థంగా పని చేస్తుందని చెప్పారు. ప్రెజెంటేషన్ సమయంలో మస్క్ గ్రోక్ 3 అధునాతన తార్కిక సామర్థ్యాలను, సంక్లిష్ట ప్రశ్నలను అర్థం చేసుకొని వాటికి ప్రతిస్పందించే విధానాలను హైలైట్ చేశారు. మెషిన్ లెర్నింగ్ పద్ధతులను ఉపయోగించి సింథటిక్ డేటాసెట్లపై ఈ మోడల్ శిక్షణ పొందినట్లు చెప్పారు. ఇది తప్పుడు సమాచారాన్ని తగ్గించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. గ్రోక్ 3 ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అత్యంత శక్తివంతమైన ఏఐ మోడళ్లలో ఒకటిగా మారిందని తెలిపారు. గ్రోక్ 3తోపాటు డీప్ సెర్చ్ అని పిలువబడే కొత్త స్మార్ట్ సెర్చ్ ఇంజిన్‌ను కూడా ఈ సందర్భంగా ప్రవేశపెట్టారు. ఇది వినియోగదారులకు మెరుగైన పరిశోధనలు అన్వేషించడానికి, డేటాను విశ్లేషించడానికి అనుమతిస్తుందని కంపెనీ తెలిపింది. గ్రోక్ 3 మోడల్ ఎక్స్ ప్లాట్‌ఫామ్ ప్రీమియం ప్లస్ చందాదారులకు ప్రత్యేకంగా అందుబాటులో ఉంటుందని పేర్కొంది. సూపర్ గ్రోక్ అని పిలువబడే కొత్త సబ్ స్క్రిప్షన్ ద్వారా ఇతరులకు దీని సేవలు అందిస్తున్నట్లు చెప్పింది.

# టెక్నాలజీ అద్భుతం.. ఎగిరే ఓడ: చూశారా?



ఇప్పటికే ఎగిరే కార్లు వచ్చేశాయి. వాటి వరుసలోనే తాజాగా ఎగిరే ఓడలు కూడా వచ్చేశాయి. సముద్రం మీదుగా రవాణా చేయటానికి ఉపయోగించే ఓడలు, ఇప్పుడు గాలిలో ఎగురుతూ ప్రయాణం చేస్తాయి. ది ఫ్లయింగ్ షిప్ కంపెనీ వింగ్‌టిప్స్ రూపొందించిన ఈ ఎగిరే ఓడ సాధారణమైన ఓడల కంటే పదిరెట్లు వేగంగా ప్రయాణిస్తుంది. హోవర్ ఇంజిన్లతో తయారుచేసిన ఈ ఓడ బ్యాటరీలతో పనిచేస్తుంది. ఒకేసారి మొత్తం 22 కిలోల బరువు వరకు సరుకు రవాణా చేయగలదు. ఇక దీనికున్న పది అడుగుల పొడవైన రెక్కల సాయంతో, ఈ నౌక దాదాపు సముద్రంపై నుంచి 80 కిలోమీటర్ల పరిధి మేరకు ఎగురుతుంది. ఇది గంటకు గరిష్ఠంగా 19 నుంచి 27 మైళ్ల (సుమారు 30 కిలోమీటర్ల నుంచి 43 కిలోమీటర్ల) వేగంతో ప్రయాణిస్తుంది. దీనిని ప్రధానంగా సరుకుల రవాణా కోసం రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. త్వరలోనే ఈ ఎగిరే ఓడల్లో మరో రెండు మోడల్స్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం.

# ఇనుములో హృదయం మొలిచెనె



**మనుషుల్లా వ్యవహరించే గుణం ఇక రోబోల సొంతం**

**గేమ్ చేంజర్‌లుగా మారనున్న హ్యూమనాయిడ్ రోబోలు**

**అనుకోకుండా జరిగే ఘటనలపై సమయానుకూల స్పందన**

**దారిలో ఏదైనా అడ్డొస్తే తప్పుకుని వెళ్లేలా శిక్షణ**

**2 కోట్ల గంటల వీడియోల ద్వారా తర్ఫీదు**

**కృత్రిమ మేథలో కొత్త శకం**

ఓ అధికారిగా దక్షిణ కొరియాలోని గుమి నగరంలో పనిచేసే రోబో మెట్ల మీదపడి చనిపోయింది అంటూ గత ఏడాది మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీనికి కారణం రియల్ లైఫ్‌లో అనుకోకుండా ఎదురయ్యే సంఘటనల పట్ల ఎలా స్పందించాలనే విషయం ఏఐ ఆధారిత రోబోలకు తెలియకపోవటమే. ఇకపై ఇటువంటి ఘటనలు జరగకుండా.. ఎదురుగా మెట్లు కనిపిస్తే మనుషుల్లాగా మెట్ల మీద నుంచి రోబోలు కిందకు దిగనున్నాయి. అంతేకాకుండా దారిలో పోతుంటే రోడ్డు మధ్యలో గుంత ఉంటే దాని మీద నుంచి గెంతి ముందుకెళ్లేలా తర్ఫీదు పొందిన రోబోలు ఇక మీదట రోడ్ల మీద తిరగనున్నాయి. మనం అలసిపోయి ఇంటికి వెళ్లి టీ తయారుచేసి.. కొంచెం తక్కువ చక్కెర వేసి ఇవ్వమంటే అలాగే తయారుచేసి ఇవ్వనున్నాయి.

### కచ్చితమైన నావిగేషన్

హ్యూమనాయిడ్ రోబోట్ నావిగేషన్ వ్యవస్థను మరింతగా మెరుగుపరచనుంది. ఈ మానవరూప రోబోలు క్లిష్ట పరిస్థితుల్లోనూ.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కచ్చితత్వంతో, మరింత పక్కాగా ముందుకు వెళ్లి పనులను నెరవేర్చే అవకాశం ఉంటుంది. అంటే రోడ్డుపై ఏదైనా అనుకోకుండా ఎదురుగానో.. పక్కనుంచో వచ్చే వాహనాలతో ప్రమాదం జరిగే సూచనలు కనిపిస్తే అందుకు అనుగుణంగా సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు ముందుకు వెళ్లేలా రూపుదిద్దుకోనున్నాయి. వాటికి ఉండే కెమెరాలు, రాడార్లు, వివిధ సెన్సార్ల ద్వారా వాస్తవ పరిస్థితులను పక్కాగా అంచనా వేసుకుని.. మెదడు వలే విశ్లేషణ చేసుకుని ముందుకు వెళ్లనున్నాయి. తద్వారా ఏఐ ఆధారిత సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు మరింత సులభంగా రోడ్లపై సంచరించనున్నాయి. ఈ రోబోలు భౌతిక ప్రపంచంలోకి అడుగు పెట్టకముందే వర్చువల్ పరిసరాలతో శిక్షణ పొంది ఉండటం వల్ల మర మనుషులు మరింత తెలివిగా నిజ జీవిత సవాళ్లను సులభంగా ఎదుర్కొనే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదాహరణకు.. కాస్మోస్ ఏఐతో కూడిన హ్యూమనాయిడ్ రోబో ఓ గదిలో ఉండే ఫర్నిచర్, ఎదురుపడే వ్యక్తులను ఢీ కొట్టకుండా రద్దీగా ఉండే గదిలో నడవగలదు. గదిలో ఎక్కడైనా తడి ఉంటే.. అక్కడ గెంతి దాటనూ గలదు. అంతేకాకుండా వాతావరణంలో వచ్చే సూక్ష్మమైన మార్పులను కూడా ఇది గుర్తించగలదని రూపకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. మర మనుషులకుండే ఈ సామర్థ్యాలతో ప్రధానంగా హోటల్, హాస్పిటల్, లాజిస్టిక్స్ పరిశ్రమల్లో విరివిగా వినియోగించుకునేందుకు దోహదపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### అచ్చం మనుషుల మాదిరిగానే..

అచ్చం మనుషుల్లా రోజువారీ జీవితంలో ఎదురయ్యే వివిధ రకాల విషయాలను వర్చువల్‌గా రోబోలకు ఎదురయ్యేలా చేసి.. వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తారు. తద్వారా రోడ్డు మీద నడిచే సమయంలో మధ్యలో గుంత వస్తే.. దాటుకుని ముందుకు వెళ్లడం.. ఎవరైనా దారికి అడ్డువస్తే తప్పుకుని వెళ్లడం ఇలా అన్ని విషయాల్లో అప్పటికప్పుడు మనుషుల తరహాలో స్పందించేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఏదైనా పరిశ్రమలో ఈ హ్యూమనాయిడ్ రోబోలను వినియోగిస్తే.. పనిచేస్తున్న సమయంలో సమస్య తలెత్తినా ప్రత్యేకంగా ఎటువంటి ఆదేశాలు అవసరం లేకుండానే వెంటనే అది పరిష్కరించుకుని ముందుకు వెళ్లే అవకాశం ఏర్పడనుంది. అంతేకాకుండా ఆస్పత్రుల్లో ఏదైనా ఆపరేషన్ చేసే సమయంలో కూడా అకస్మాత్తుగా సమస్య తలెత్తితే కూడా పరిష్కరించుకునే విధంగా వీటిని తయారు చేస్తున్నారు. హోటల్స్‌లో మనం చెఫ్‌కు ‘ఆమ్లెట్ విత్ లెస్ స్పైసీ’ ఆర్డర్ ఇచ్చినట్టుగానే.. రోబోకు సైతం మనకు ఇష్టం నచ్చిన రుచుల్లో ఫుడ్ ఆర్డర్ చేయొచ్చు. ఆ రోబో మనం ఇచ్చే ఆర్డర్‌కు అనుగుణంగా వంటకాలను తయారుచేసి అందించేస్తుందన్న మాట.

### సిద్ధమైన హ్యూమనాయిడ్ రోబో

రోబోలు సైతం మనసున్న మనుషుల్లాగే అనుకోకుండా జరిగే ఘటనలకు మనుషుల తరహాలోనే స్పందించే విధంగా తయారవుతున్నాయి. ఇటువంటి హ్యూమనాయిడ్ రోబోలను నివిదియా సీఈవో జెన్‌షెన్ హుయాగ్ సిద్ధం చేశారు. గత నెలలో లాస్ వేగాస్‌లో జరిగిన సీఈఎస్-2025లో తన హ్యూమనాయిడ్ రోబో పరిశోధనలను ఆయన వివరించారు. ఏదైనా పనిచెబితే.. అప్పటికప్పుడు చేయడంతో పాటు నిజజీవితంలో ఎదురయ్యే వివిధ ఘటనల పట్ల శిక్షణ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఫిజికల్ డైనమిక్ థింగ్స్.. ఫిజికల్ వరల్డ్‌ను అర్థం చేసుకునేందుకు వీలుగా 20 మిలియన్ గంటల (2 కోట్ల గంటల) వీడియోల ద్వారా హ్యూమనాయిడ్ రోబోకు శిక్షణ అందించినట్టు ఆయన పేర్కొన్నారు.

# తెరపైకి తెలివైన బుర్ర




**ఏఐకి తగినట్టుగా దేశీయ సెమీ కండక్టర్ చిప్‌ల రూపకల్పనపై ఫోకస్**

**ఇప్పటికే ‘శక్తి’మైక్రోచిప్‌ను సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఇస్రో-ఐఐటీ మద్రాస్**

హైదరాబాద్: మొబైల్ ఫోన్ల నుంచి స్మార్ట్ పరికరాల దాకా ఏది పనిచేయాలన్నా కంప్యూటర్ చిప్‌లు కంపల్సరీ. అందులోనూ కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాల కోసం వేగవంతమైన, సమర్థవంతమైన మైక్రో ప్రాసెసర్లు అవసరం. వాటి ని తగిన విధంగా ఉపయోగించుకోవడానికి, కృత్రిమ మేధను అనుసంధానం చేయడానికి లాంగ్వేజ్ మోడల్స్ కావాలి. ఇప్పుడు వీటన్నింటినీ దేశీయంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు కూడా ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాయి. స్మార్ట్ టెక్నాలజీపై కసరత్తు చేస్తున్నాయి. మైక్రో చిప్స్‌ను, అత్యంత శక్తివంతమైన సెమీ కండక్టర్లను రూపొందించి ఏఐ మేధోశక్తికి అనుసంధానం చేస్తున్నాయి. 2027 నాటికి అంతరిక్ష, వైద్య, విద్య, న్యాయ రంగాల్లో శరవేగంగా నాణ్యమైన సేవల ందించే ఏఐ ఆధారిత మాడ్యూల్స్ కూడా రూపొందుతున్నాయి.

ఊపిరిపోస్తున్న పరిశోధనలు

చిప్‌ల అభివృద్ధి, కృత్రిమ మేధ రంగంలో దిగ్గజ కంపెనీలే కాదు.. మన దేశంలో ఐఐటీ విద్యార్థులు, అంతరిక్ష పరిశోధకులు కూడా రంగంలోకి దిగారు. మద్రాస్ ఐఐటీ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సంయుక్తంగా ‘శక్తి’ పేరిట చిప్‌ను, దాని ఆధారంగా పనిచేసే మైక్రో ప్రాసెసర్లను రూపొందించాయి. ఇప్పుడిప్పుడే ప్రాణం పోసుకుంటున్న ఈ ప్రాసెసర్లు అత్యంత శక్తివంతంగా పనిచేస్తాయని, అంతరిక్ష రంగంలో అద్భుత సాంకేతికత వినియోగానికి వీలుకల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

లాంగ్వేజ్ మాడ్యూల్స్‌తోనూ..

కృత్రిమ మేధలో కీలకమైన మైక్రో అండ్ స్మాల్ లాంగ్వేజ్ మాడ్యూల్స్‌ను ఐటీ దిగ్గజాలు ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా వంటి సంస్థలు రూపొందిస్తున్నాయి. నేరాల దర్యాప్తు, న్యాయ విభాగాలకు సంబంధించి ఇవి అద్భుతాలు సృష్టించగలవని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు పదేళ్లుగా కనిపించకుండా పోయిన వ్యక్తి.. చిన్ననాటి ఫోటో ఆధారంగా ఇప్పుడెలా ఉన్నాడు? ఆ వ్యక్తి ఏయే ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉంది? అనే అంశాలను ఏఐ ఆధారంగా అంచనా వేయవచ్చు. కోట్లాది మంది వ్యక్తుల కదలికలను పసిగట్టి, గుర్తించగల టెక్నాలజీని ఇందులో పొందుపరుస్తున్నారు. ఇక ఏదైనా కేసులో న్యాయమూర్తి తీర్పు చెప్పే ముందు అలాంటి కేసుకు సంబంధించిన గతంలోని జడ్జిమెంట్లను క్రోడీకరించి అందించే మాడ్యూల్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నారు. మరోవైపు వైద్య రంగంలో శస్త్ర చికిత్సల సమయంలో స్మార్ట్ లాంగ్వేజ్ ద్వారా కణజాలాల స్థాయిలో స్కానింగ్ చేసి విలువైన సమాచారం ఇవ్వగల మాడ్యూల్ అందుబాటులోకి రానుంది. చికిత్స వంద శాతం విజయవంతంగా పూర్తయ్యేందుకు అవి సహకరించనుంది.

మరింత మేధోమథనం జరగాలి..

ఏఐలో కీలకమైన చిప్స్ తయారీ, లాంగ్వేజ్ మాడ్యూల్స్‌కు సంబంధించి తెలంగాణలో మరింత కృషి జరగాలని నిపుణులు చెబుతున్నారు. ఇంతకాలం సీఎస్‌సీ, ఇతర కంప్యూటర్ కోర్సులు చేసిన విద్యార్థులు.. ఎలక్ట్రానిక్స్ కోర్సులను చిన్నచూపు చూశారని, సెమీ కండక్టర్స్‌ను, ఏఐ ఆధారిత చిప్స్‌ను ఇప్పటికీ మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని గుర్తు చేస్తున్నారు. 2026 నాటికి మైక్రో చిప్స్, మినీ మైక్రో చిప్స్ అవసరం 60 శాతం పెరుగుతుందని, ఇప్పటి అవసరాల్లో భారత్ కేవలం 20 శాతమే సమకూర్చుకుంటోందని అంటున్నారు. అమెరికా ఆంక్షలు, చైనా డీప్‌సీక్ వ్యవహారం తర్వాత సొంతంగా మాడ్యూల్స్, మైక్రో చిప్స్ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఏఐ, మారుతున్న టెక్నాలజీల నేపథ్యంలో తెలంగాణలో ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు అవసరమని ఉన్నత విద్యా మండలి భావిస్తోందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

సెమీకండక్టర్స్ రూపకల్పనపై దృష్టిపెట్టాలి

సాఫ్ట్‌వేర్ బూమ్ కారణంగా మనవాళ్లు సెమీ కండక్టర్లు, చిప్‌ల తయారీపై ఇంతకాలం దృష్టి పెట్టలేదు. ఇప్పుడా అవసరం ఏర్పడింది. ఏఐకి డేటా అందించే కమాండ్ సెన్సర్ల తయారీ వ్యవస్థలో ఎలక్ట్రానిక్స్ విద్యార్థుల పాత్ర కీలకం. ప్రభుత్వాలు కూడా సెమీ కండక్టర్ల రూపకల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. స్మార్ట్ ఎలక్ట్రానిక్స్ రూపకల్పనకు అవసరమైన తోడ్పాటు అందించి.. యువతరాన్ని ప్రోత్సహించాలి. ఏఐ దూసుకొస్తున్న వేళ మన విద్యార్థుల పరిశోధనకు మంచి అవకాశం కల్పించాలి.

తోడ్పాటుకు ‘ఏఐ’ సరే.. తుది నిర్ణయం సరికాదు

న్యాయవ్యవస్థలో కొత్త సాంకేతికత ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే దానికి పరిమితులు ఉండాలి. సాక్ష్యం, నేర దర్యాప్తు, పాత తీర్పుల తోడ్పాటు వంటి అంశాలకే ఏఐ పరిమితం అవ్వాలి. కేసుకు సంబంధించిన పూర్తి విచారణ, తీర్పులో మానవ మేధోశక్తి మాత్రమే పనిచేయాలి. అప్పుడే తీర్పులు వాస్తవికతకు అద్దం పడతాయి. ఏఐ ఎంత శక్తివంతమైంది అయినా దాన్ని న్యాయ వ్యవస్థలో పరిమితంగానే వాడాలి.

# ‘ఆది వాణి’ ఏఐతో భాష పదిలం



దేశవ్యాప్తంగా గిరిజన తెగల భాషా వారసత్వాన్ని పెంపొందించడానికి, దాన్ని పరిరక్షించడానికి భారత ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతోంది. భాషాపరమైన అంతరాన్ని పూడ్చే ప్రయత్నంలో భాగంగా భిలి, ముండారి, సంతాలి, గోండితో సహా అనేక దేశీయ గిరిజన భాషల్లో అనువాదం, అభ్యాసం కోసం కృత్రిమ మేధ ఆధారిత అప్లికేషన్ ‘ఆది వాణి’ని కేంద్రం ఆవిష్కరించనుంది.

### సాంకేతికతతో సాధికారత

ఆది వాణిని అభివృద్ధి చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి ప్రముఖ సంస్థల సాయం తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గిరిజన భాషల్లో ప్రత్యేకత కలిగిన భాషావేత్తలు, పరిశోధకుల సహకారం కోరినట్లు చెప్పాయి. అనువాదం, విద్యా ప్రయోజనాల కోసం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడేలా ఈ యాప్‌ను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గిరిజన విద్యార్థులు వారి మాతృభాషలో చదువు నేర్చుకోవడానికి ఇది ఎంతో సహాయపడుతుందని చెప్పారు. అదే సమయంలో అంతరించిపోతున్న కొన్ని అరుదైన భాషలను కాపాడుకునేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.

### భాష పరిరక్షణకు..

భారతదేశంలో 700కి పైగా విభిన్న గిరిజన సమాజాలున్నాయి. ప్రతి ఒక్కటి దాని సొంత ప్రత్యేకమైన భాష, మాండలికాలు, సంప్రదాయాలను కలిగి ఉంది. కారణాలు ఏవైనా ఈ భాషల్లో అనేకం అంతరించిపోతున్నాయి. కొన్ని తెగలు వారి భాషా గుర్తింపునే కోల్పోతున్నాయి. ఆది వాణితో ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. భాషలను పరిరక్షించడమే కాకుండా దైనందిన జీవితంలో దీన్ని చురుగ్గా ఉపయోగించే వాతావరణాన్ని సృష్టించాలని కేంద్రం భావిస్తోంది.

### విద్యార్థులకు ఎంతో మేలు..

ఆది వాణి యాప్‌లో గిరిజన భాషా అనువాదాలను అందించనున్నారు. దీని ద్వారా విద్యార్థులు ఏ భాషలో కంటెంట్ ఇచ్చినా అది తాము కోరుకున్న గిరిజన భాషలోకి మారుతుంది. తమ మాతృభాషలో పాఠ్యపుస్తకాలు, ఆడియో, విజువల్ కంటెంట్ పాఠాలను యాక్సెస్ చేసుకోవచ్చు. ఈ ప్రయత్నం వల్ల విద్యార్థులకు కష్టంగా ఉండే గణితం, సైన్స్, చరిత్ర వంటి సబ్జెక్టులను అర్థం చేసుకోవడానికి, అందులో రాణించడానికి వీలవుతుంది. దాంతోపాటు ఈ యాప్ ఉపాధ్యాయులకు విలువైన వనరుగా ఉంటుందని, భాషా అవసరాలను అర్థం చేసుకోవడానికి, తదనుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకోవడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. సాంస్కృతిక, భాషా నేపథ్యాలతో సంబంధం లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించాలన్న కేంద్రం విస్తృత లక్ష్యానికి ఇది తోడ్పడుతుంది.